RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 22-08-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 160 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

# ఎకరం రూ. 264 కోట్లు!



## రాయదుర్గంలో ఆకాశాన్నంటిన భూముల ధరలు

**రూ. 1,386 కోట్లకు పీ1 ప్లాట్ విక్రయం**

**మూడు నెలల్లోనే పాత రికార్డులు అవుట్**

**గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా భాగ్యనగరం**

హైదరాబాద్, ఆగస్టు 21 (వుదయం) :

రాజధానిలోని ప్రీమియం బిజినెస్ డిస్ట్రిక్ట్ రాయదుర్గంలో భూముల విలువ మరోసారి ఆకాశాన్ని తాకింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) తాజాగా నిర్వహించిన ఈఆక్షన్‌లో ప్లాట్ నంబర్ పీ1లోని భూమి ఎకరాకు ఏకంగా రూ. 264 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ప్రభుత్వ సంస్థలు ఇప్పటివరకు నిర్వహించిన భూముల వేలంలో భాగ్యనగర చరిత్రలోనే ఇది అత్యధిక ధర కావడం గమనార్హం.

**వేలం విశేషాలు:**

మొత్తం విక్రయ భూమి: 5.25 ఎకరాలు
మొత్తం ఆదాయం: రూ. 1,386 కోట్లు
రిజర్వ్ ధర: ఎకరాకు రూ. 175 కోట్లు
తుది ధర: ఎకరాకు రూ. 264 కోట్లు (రిజర్వ్ ధర కంటే 51% అధికం)
ట్రాన్సాక్షన్ అడ్వైజర్: జేఎల్ఎల్ (JLL)
వేలం ప్లాట్‌ఫామ్: ఎంఎస్‌టీసీ ఈఆక్షన్ (MSTC eAuction)

3 నెలల్లోనే సొంత రికార్డు బద్దలు

గత మే నెలలో ఇదే రాయదుర్గం ప్రాంతంలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరా రూ. 237 కోట్లు పలికింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఆ రికార్డును తిరగరాస్తూ పీ1 ప్లాట్ ఎకరాకు రూ. 264 కోట్ల బిడ్‌ను సాధించడం రియల్ ఎస్టేట్ వర్గాలను విస్తుపోయేలా చేసింది.

**ప్రపంచస్థాయి పెట్టుబడులకు చిరునామా**

ఈ సందర్భంగా టీజీఐఐసీ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక (IAS) మాట్లాడుతూ.. ఈ వేలం ఫలితం రాష్ట్ర భవిష్యత్తుపై మరియు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై జాతీయ, అంతర్జాతీయ డెవలపర్లకు ఉన్న విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుల దూరదృష్టితో కూడిన నాయకత్వం వల్లే హైదరాబాద్ పెట్టుబడుల రాజధానిగా ఎదుగుతోందని తెలిపారు.

## ఇంతే కదా...!




# కేంద్రం 'నో'.. యుఎస్ పర్యటన రద్దు



**కేంద్రం అనుమతి నిరాకరణ**

**లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరుగుపయనం కానున్న సీఎం**

**రాజకీయ కోణంలోనే అనుమతి నిరాకరణ**

**విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు ఆగవు**

హైదరాబాద్, ఆగస్టు 21 (వుదయం) :

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వం యూకే, యుఎస్ పర్యటనలకు అనుమతి కోరగా, తొలుత యూకేకు మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చింది. అధికారిక బృందం యూకే పర్యటనలో ఉండగానే, రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం తెలియజేసింది.

**ప్రధాన అంశాలు:**

కేంద్ర నిర్ణయంపై సీఎం తీవ్ర విస్మయం: తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతి మరియు 'వికసిత్ భారత్' నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు రాజకీయ రంగు పులిమి అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ బోస్టన్, అమెరికా పర్యటనను రద్దు చేసుకుని లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు.

పర్యటన ముఖ్య ఉద్దేశం: కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, అగ్రశ్రేణి విద్యాసంస్థలను భారత్‌కు, ముఖ్యంగా తెలంగాణకు తీసుకురావడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని సీఎం తెలిపారు. మన యువతకు అంతర్జాతీయ స్థాయి విద్య, నైపుణ్యాలు ఇక్కడే అందుబాటులోకి తేవాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. "దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయంలో రాజకీయా తీత ఆలోచన అవసరం" అని ఆయన వ్యాఖ్యానించారు.

అధికారులకు స్పష్టమైన ఆదేశాలు: సీఎం పర్యటన రద్దయినప్పటికీ, ఇప్పటికే చర్చలు జరిపిన అమెరికన్ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు (MoUs) మరియు భాగస్వామ్య ప్రక్రియలను ముగించాలని అధికారుల బృందాన్ని సీఎం ఆదేశించారు.

ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్: హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం పునరుద్ఘాటించారు. ఉస్మానియా, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూల నుంచి నేటి ఐఐటీ, ఐఎస్‌బీ, నల్సార్ వరకు నగరం మానవ వనరుల కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. సామాన్య విద్యార్థి కూడా హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సర్టిఫికేషన్ పొందే వాతావరణం కల్పిస్తామన్నారు.

**యూకే పర్యటన యథాతథం**

షెడ్యూల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (LSE), లండన్ బిజినెస్ స్కూల్ వంటి ప్రఖ్యాత విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. అలాగే యూకేలోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగానికి చెందిన ప్రముఖులతో భేటీ అయి తెలంగాణతో అధికారిక భాగస్వామ్యాలను ఖరారు చేయనున్నారు.

## అభినయ తార అస్తమయం



హైదరాబాద్, ఆగస్టు 21 (వుదయం) :

ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ పురస్కార గ్రహీత 'షావుకారు' జానకి గారు మరణించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతితో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక గొప్ప అభినయ తారను కోల్పోయిందని కొనియాడారు.

ఏడు దశాబ్దాల అసాధారణ నట ప్రస్థానం

**తొలి రోజులు:** బాల్యం నుంచే నాటకాలపై అభిరుచితో వివిధ పాత్రలు పోషిస్తూ తన నటనా జీవితాన్ని ప్రారంభించారు.

**'షావుకారు'తో స్థిరపడిన పేరు:** 'షావుకారు' చిత్రంలో ఆమె కనబరిచిన అద్భుతమైన నటన, అసమాన ప్రతిభతో ఆ చిత్ర పేరే ఆమె ఇంటిపేరుగా మారి 'షావుకారు జానకి'గా చిత్రసీమలో స్థిరపడిపోయారని సీఎం గుర్తుచేశారు. బహుభాషా నటి: దాదాపు ఏడు దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో సుమారు 400 కి పైగా చిత్రాల్లో నటించడమే కాకుండా హిందీ, మలయాళ భాషల్లోనూ నటించి కోట్లాది మంది అభిమానుల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు.

## రేవంత్ రెడ్డి పర్యటన తర్వాతే మాట్లాడతానన్న కొండా సురేఖ



హైదరాబాద్, ఆగస్టు 21 (వుదయం) :

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుల అంశంపై తాను చెప్పాల్సిన విషయాలను ఇప్పటికే స్పష్టం చేశానని తెలంగాణ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం మీడియాతో చర్చించబోనని వెల్లడించారు. "కమిటీకి ఇవ్వాల్సిన వివరణను నిన్ననే పంపించాను, కొత్తగా చెప్పడానికి ఏమీ లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన తర్వాతే ఈ అంశంపై మాట్లాడతాను" అని ఆమె స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు పంపింది. దీనిపై కమిటీ ఛైర్మన్‌కు వివరణ ఇచ్చిన మంత్రి, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కాబట్టి ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిపైనే నేరుగా విమర్శలు గుప్పించడాన్ని హైకమాండ్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం అధిష్ఠానం వద్ద తీవ్ర చర్చకు దారితీసింది. క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేది లేదని స్పష్టం చేస్తున్న కాంగ్రెస్ వర్గాలు, కేవలం నోటీసులతో సరిపెట్టకుండా తదుపరి తీవ్రమైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నాయి.

## భారత అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఎఎంఎస్) :

స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్సీ, పియర్‌సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, శాట్‌సూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రోబేస్, టేక్‌మీ2స్పేస్, వ్యోమిక్, కాస్మోసర్వ్ స్పేస్, ఆర్బిట్ ఎయిడ్ ఏరోస్పేస్, స్కైసెర్వ్ (హైస్పేస్), సెరెండిపిటీ స్పేస్, వాసార్ ల్యాబ్స్, మిస్ట్ ఈఓ వంటి ప్రముఖ అంతరిక్ష రంగ స్టార్టప్‌ల ప్రతినిధులతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.

**సాంకేతిక పురోగతి మరియు లక్ష్యాలు**

రాకెట్లు, పునర్వినియోగ ఉపగ్రహ వాహనాలు, ఉపగ్రహాలు, ఏవియానిక్స్, అధునాతన చోదన వ్యవస్థలు, స్పేస్ ఇంటెలిజెన్స్, అంతరిక్ష వ్యర్థాల తొలగింపు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వాతావరణ సమాచార సాంకేతికతలపై పనిచేస్తున్న ఈ సంస్థలు తమ ప్రగతిని, భవిష్యత్తు ప్రణాళికలను ప్రధానికి వివరించాయి.

ప్రైవేట్ రంగానికి ప్రధాని మోదీ అభినందనలు

అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవడం వెనుక ఉన్న లక్ష్యాన్ని ప్రైవేట్ సంస్థలు తమ నమ్మకంతో మరింత బలోపేతం చేశాయని ప్రధాని మోదీ కొనియాడారు. చొరవ తీసుకుని ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను ఆయన అభినందించారు. మన అంతరిక్ష రంగం ప్రపంచ స్థాయి ప్రతిభను, అంతర్జాతీయ సంస్థలను, పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యాన్ని కలిగి ఉందని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ సహకారంపై స్టార్టప్‌ల సంతోషం**

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, పారిశ్రామిక వర్గాల మధ్య పెరుగుతున్న పరస్పర సహకారం పట్ల అంతరిక్ష స్టార్టప్‌ల వ్యవస్థాపకులు కృతజ్ఞతలు తెలిపారు. భారత్ లోని ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ అభివృద్ధి చేసిన నూతన సాంకేతికతలను స్వీకరించడానికి వివిధ రంగాలకు చెందిన సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు.

**సామాజిక ప్రయోజనాలకు సాంకేతికత**

అంతరిక్ష సాంకేతికతలను కేవలం రంగానికే పరిమితం చేయకుండా వ్యవసాయం, పర్యావరణ సంస్థలు వంటి ఇతర రంగాలలో విస్తృతంగా ఉపయోగించేందుకు కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. అలాగే, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో అంతరిక్ష రంగంపై ఆసక్తిని పెంపొందించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి పనిచేయాలని సూచించారు.

## బాధితుడికి న్యాయం జరిగే వరకు తగ్గేదే లేదు



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఎఎంఎస్) :

ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసులు పెల్లెట్ గన్లు (pellet guns) ఉపయోగించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సాహిల్ అనే బాధితుడితో కలిసి ఆయన శుక్రవారం మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అయితే అధికారులు అందుకు నిరాకరించడంతో రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వెలుపల ధర్నాకు దిగారు.

**పోలీసుల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం**

ఈ ఘటనకు సంబంధించి ఈ నెల 17నే ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఢిల్లీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. బాధితుడికి న్యాయం జరుగుతూ, కేసు నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీతో పాటు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు ధర్నాలో పాల్గొనడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

బాధితుడికి మద్దతుగా మీడియా సమావేశం

జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు, భద్రతా బలగాలు దారుణంగా పెల్లెట్ గన్లను వినియోగించారని రాహుల్ వెల్లడించారు. బాధితుడైన సాహిల్ శరీరంలో 200కు పైగా పెల్లెట్ షెల్స్ గుచ్చుకున్నాయని, అందులో మూడు షెల్స్ కంటికి తీవ్ర గాయం చేయడంతో అతను చూపు కోల్పోయే ప్రమాదంలో ఉన్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ యువకుడితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

**కేంద్ర ప్రభుత్వ ప్రకటనలపై ధ్వజం**

ఆందోళనకారులపై ఎలాంటి పెల్లెట్ గన్లు ఉపయోగించలేదని కేంద్ర మంత్రులు, పోలీసులు వాస్తవాలను దాచిపెడుతున్నారని రాహుల్ విమర్శించారు.




### జాతీయ ఆహార భద్రత మిషన్‌పై

# రైతులకు అవగాహన సదస్సు

- "శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు సాధించాలి"
- "మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్"

**కోహీర్ , ఆగస్టు 21 (వుదయం ప్రతినిధి )**



రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో, మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ అధ్యక్షతన జాతీయ ఆహార భద్రత మిషన్ 2026-27 కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు శాస్త్రీయ సాగు విధానాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, నేల స్వభావానికి అనుగుణంగా పంటల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, పురుగులు-తెగుళ్ల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.పంటలకు అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని, వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకున్న తర్వాతే మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటే పంట దిగుబడులు పెరగడంతో పాటు రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని నవీన్ కుమార్ సూచించారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువస్తే తగిన సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు.

**రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం**

సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ.. గురుజువాడ గ్రామ రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారాన్ని అందించేందుకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ సూచనలు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, రైతుల ఆర్థికాభివృద్ధే గ్రామాభివృద్ధికి బలమైన పునాది అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఉప సర్పంచ్ సాయి కుమార్ మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ ఏఈఓ వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అడ్డంకులు ఎందుకు..??

- మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో పురుషుల పెత్తనం ఎందుకు..?
- పాలకవర్గం సమష్టిగా పనిచేయాలని ప్రజల ఆకాంక్ష

**దౌల్తాబాద్, ఆగస్టు 21(వుదయం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్పంచ్ మచ్చమర్రి అనురాధ ముందుకు సాగుతున్న నేపథ్యంలో పాలకవర్గంలోని కొందరు సభ్యుల వ్యవహారశైలిపై గ్రామంలో చర్చ జరుగుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులంతా రాజకీయ విభేదాలను పక్కన పెట్టి గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాల్సి ఉండగా, కొందరు వార్డు సభ్యుల కుటుంబ సభ్యులు పాలనలో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తుండటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.దౌల్తాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, తాను జన్మించిన గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో సర్పంచ్ అనురాధ ముందుకు సాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడం,ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాల్లో పాలకవర్గాన్ని ఏకతాటిపైకి తీసుకురావాలని ప్రయత్నం చేసిన ఫలితం దక్కడం లేదు అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

**వార్డు సభ్యుల స్థానంలో కుటుంబ సభ్యుల పెత్తనమా?**

ప్రజల ఓట్లతో ఎన్నికైన వార్డు సభ్యులు తమ వార్డుల సమస్యలను గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లి, సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు, కుమారులు లేదా ఇతర కుటుంబ సభ్యులు పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**మహిళలకు కల్పించిన ప్రాతినిధ్యానికి అర్థం ఏది?**

మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. మహిళా సర్పంచ్, మహిళా వార్డు సభ్యులు ప్రజల ఓట్లతో ఎన్నికైన తర్వాత వారి స్థానంలో భర్తలు లేదా ఇతర కుటుంబ సభ్యులు అధికారిక వ్యవహారాలు నిర్వహిస్తే మహిళా సాధికారత లక్ష్యం దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులే ప్రజలతో సమావేశాలు నిర్వహించడం, అధికారులను కలిసి సమస్యలను వివరించడం, పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, అభివృద్ధి పనులపై నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కావడం ప్రజాస్వామ్యబద్ధమైన విధానమని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి విరుద్ధంగా అనధికారికంగా




ఇతరులు పెత్తనం చేస్తే ఫిర్యాదు వచ్చిన సందర్భంలో సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరుతున్నారు.

**కమిషన్ల ఆరోపణలపై విచారణ జరపాలి**

అభివృద్ధి పనుల్లో పెట్టుబడి లేకుండా కొందరు కమిషన్లు కోరుతున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఇవి ఆరోపణల స్థాయిలోనే ఉన్నందున సంబంధిత వ్యక్తుల వివరణ, ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ప్రజా నిధులతో చేపట్టే ప్రతి పనిలో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనం ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.అభివృద్ధి పనుల్లో అవకతవకలు, అక్రమ వసూళ్లు లేదా కమిషన్లకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే వాటిపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

**దౌల్తాబాద్ అభివృద్ధే లక్ష్యంగా ఉండాలి**

వ్యక్తిగత రాజకీయాలు, వర్గ విభేదాలు, కుటుంబ పెత్తనాలకు అతీతంగా దౌల్తాబాద్ అభివృద్ధికి ప్రతి ప్రజాప్రతినిధి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, మౌలిక వసతులు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పాలకవర్గం సమష్టిగా పనిచేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న వార్డు సభ్యులు, సర్పంచ్ గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తే దౌల్తాబాద్ అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పదవిలో ఉన్న సమయంలో ప్రజల కోసం చేసిన సేవలే భవిష్యత్తులో వారి గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొంటున్నారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేసే ప్రజాప్రతినిధుల పేర్లు దౌల్తాబాద్ చరిత్రలో నిలిచిపోతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో పదవులను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం, కుటుంబ సభ్యుల ద్వారా పెత్తనం చేయించడం, అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం వంటి ఆరోపణలు ఎదురైతే ప్రజల్లో వ్యతిరేకతకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలని, కుటుంబ సభ్యుల ద్వారా పాలన సాగించే విధానానికి దూరంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో పదవి అంటే అధికారం మాత్రమే కాదని.. ప్రజలకు సేవ చేసే బాధ్యత అని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

**ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేయాలి**

దౌల్తాబాద్ అభివృద్ధి విషయంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర పాలక వర్గ సభ్యులు పరస్పరం సహకరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ సమస్యలపై పంచాయతీ సమావేశాల్లో చర్చించి, అవసరమైన నిర్ణయాలు తీసుకుని, నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచిస్తున్నారు.ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని గౌరవించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తే వారి సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రజల విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు గ్రామస్థులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దౌల్తాబాద్ అభివృద్ధి కోసం వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పాలక వర్గం ఒక్కటిగా పనిచేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# 18–55 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

- సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

**సంగారెడ్డి కస్పాండెంట్ , ఆగస్టు 21, వుదయం :**

జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023 24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# భూసేకరణలో జాప్యానికి చెల్లుచీటి!

- సాగునీటి ప్రాజెక్టుల పనులకు ఇక వేగం.. ఆర్అండ్ఆర్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
- పరిహారం నేరుగా నిర్వాసితులకే చేరాలి.. అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం

**గద్వాల ఆగస్టు 21 (వుదయం బ్యూరో)**

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో జాప్యానికి ఇక తావులేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం (ఆర్అండ్ఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇంజినీ రింగ్ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదలైనందున భూసేకరణ, పరిహారం, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతుల సమస్యల కారణంగా పనులు నిలిచిపో కుండా వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. ఖాతాలో జమ చేస్తే సరిపోదునిర్వాసితుల పరిహారం విషయంలో మంత్రి కీలక సూచనలు చేశారు. ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయడం, కలెక్టర్ పీడీ ఖాతాల్లో నగదు జమ కావడం మాత్రమే చెల్లింపు పూర్తయినట్లు కాదని స్పష్టం చేశారు. మంజూరైన పరిహారం సంబంధిత లబ్ధిదారుడి చేతికి చేరినప్పుడే ప్రక్రియ పూర్తయినట్లు భావించాలని పేర్కొన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

**అడ్డంకులు గుర్తించి.. నివేదిక ఇవ్వాలి**

సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి అడ్డంకిగా ఉన్న అటవీ సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, భూసేకరణ, ఆర్అండ్ఆర్, ఆర్థిక అనుమతులు, టోకెన్లు తదితర అంశాలను అధికారులు స్పష్టంగా గుర్తించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. భూసేకరణ లేదా పరిహారం చెల్లింపులు, ఆర్అండ్ఆర్, అటవీ సమస్యలు, ఆర్థికపరమైన లేదా ప్రక్రియాపరమైన కారణాలతో ఏ ప్రాజెక్టు ఆలస్యమైనా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ బాధ్యతగా సమస్యను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాలని స్పష్టం చేశారు.అధికారులతో కలెక్టర్ సమీక్ష గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు



ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరించాలని, పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టుల పురోగతికి ఉన్న అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- మెనూ ప్రకారం రుచికరమైన, పోషకాహార భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ధరూర్ ఆగస్టు 21 (వుదయం బ్యూరో)**



విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శుక్రవారం ధరూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించడంతో పాటు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో భోజనం నాణ్యతపై మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంటగది, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను కూడా పరిశీలించారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలను సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ నందిని, ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- భూసేకరణ నిధుల విడుదలకు సీఎం ఆమోదం, ప్రాజెక్టు పనులకు ఆటంకం లేకుండా చూడాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 21 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, భూయజమానులకు పరిహారం చెల్లింపు, పునరావాసం, అటవీ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం నీటిపారుదల ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసంపునరావాస పునరుద్ధరణ (R&R), పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు తదితర అంశాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ. శ్రీధర్ తో కలిసి మంత్రి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చెన్నయ్య, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విజయ్ భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తవడం అత్యంత ముఖ్యమన్నారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పెండింగ్ భూసేకరణను వేగవంతం చేసేందుకు నిధులను విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు.అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తున్నందున అధికారులు భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టులోనూ భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక శాఖ నుంచి విడుదలైన నిధులు, జిల్లా కలెక్టర్ పీడీ ఖాతాలో ఉన్న నిధులు, చెల్లించిన పరిహారం వివరాలను సమగ్రంగా పర్యవేక్షించాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశంవీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పెండింగ్ భూసేకరణ అంశాలపై అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు.భూసేకరణకు సంబంధించిన ప్రతి కేసును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, భూయజమానులు, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు పునరావాస చర్యలను సమాంతరంగా చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# ప్రభుత్వ ఉద్యోగులకు ఏ ఐ సి ఎస్ క్రీడా ఎంపికలు

**గద్వాల ఆగస్టు 21 (వుదయం కరస్పాండెంట్)**

గద్వాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2026-27 సంవత్సరానికి నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు సెప్టెంబర్ 3న గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తోటకూర రామలింగేశ్వర్ గౌడ్ తెలిపారు.

**19 క్రీడాంశాల్లో ఎంపికలు**

అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖోఖో క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఆగస్టు 31లోగా వివరాలు సమర్పించాలి**

అర్హత కలిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆగస్టు 31లోగా తమ Employee ID, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో వివరాలు సమర్పించాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపనున్నట్లు తెలిపారు.

**ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తికి ప్రోత్సాహం**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులకు ఈ విషయాన్ని తెలియజేసి, ఎంపికల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని జిల్లా యువజన, క్రీడల అధికారి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించడంతో పాటు దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు AICS ఎంపికలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం!

- పెండింగ్ భూసేకరణ, పరిహారానికి రూ. 2,800 కోట్లు విడుదల: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నిధుల కొరత లేదు.. జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలి: కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వం
- భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలి: అధికారులకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశం

**సిద్దిపేట, ఆగస్టు 21 (వుదయం బ్యూరో)**




రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి, రైతులకు కొత్త ఆయకట్టును అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టుల పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు మరియు పునరావాస పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**భూసేకరణకు రూ. 2,800 కోట్లు – మంత్రి ఆదేశాలు:**

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టుల పనులకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో నిధులు విడుదల చేస్తోందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం రూ. 2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టామని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆమోదం తెలిపారని వెల్లడించారు. నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఆయకట్టు సృష్టికి అవసరమైన పునరావాస పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించి రైతులతో సమన్వయం: కలెక్టర్ కె. హైమావతిజిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సజావుగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే, ప్రాజెక్టుల పనులను గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు పట్టుదలతో పనిచేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్ మరియు జిల్లా సమీక్షలో కలెక్టర్ కె. హైమావతితో పాటు నీటిపారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ), డివిజనల్ ఇంజనీర్ (డిఈ) మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# కలశ్ వందన్ అభియాన్' పోస్టర్ ఆవిష్కరణ

- 23న హైదరాబాద్‌లో కలశాల పంపిణీ
- బిజెపి రాష్ట్ర నాయకుడు దామెర రామ్‌సుధాకర్‌రావు

**ధర్మపురి ఆగస్ట్21 (వు దయం ప్రతినిధి):**



సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, కుల, వర్గ భేదాలు లేని సమసమాజ స్థాపనే ఆయన లక్ష్యమని భాజపా రాష్ట్ర నాయకుడు దామెర రామ్‌సుధాకర్‌రావు అన్నారు. పట్టణ శాఖ అధ్య క్షుడు గాజు భాస్కర్ అధ్వ ర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద కలశ్ వందన్ అభియాన్ గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రామ్‌సుధాక ర్‌రావు మాట్లాడుతూ రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన కాశీ పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన కలశాలను దేశవ్యాప్తంగా పంపిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణకు చేరిన ఈ పవిత్ర కలశాలను రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి, రవిదాస్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతారని తెలిపారు. జిల్లా నుంచి భాజపా శ్రేణులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్‌కు మార్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, కస్తూరి మురళి, రాయల రవికుమార్ సిందే, పల్లెర్ల సురేందర్, స్తంభంకాడి శ్యామ్,పట్టణ ప్రధాన కార్యద ర్శులు తిరుమందాస్ సత్యనా రాయణ, సంఘీ మాధవ్, జిల్లా ఎండోమెంట్ ధార్మిక కోకన్వీనర్ కలకోట రాజు, ఉపాధ్యక్షుడు సుంకు మధుసూదన్, నాయ కులు ఠాగూర్ రాకేష్, తోట శ్రీనివాస్, సోమిశెట్టి శివసాయి, పూదరి పవన్, కాసారపు వెంకటేష్, మామిడిపల్లి రంజిత్, కొత్తపల్లి కిషన్ పాల్గొన్నారు.

# శ్రీవారి ఆశీస్సులు కోరిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



**(వుదయం హైదరాబాద్):**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి, సంక్షేమం కోసం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు..ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తనకు శక్తి, సామర్థ్యం ప్రసాదించాలని శ్రీవారిని వేడుకున్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల రాష్ట్రస్థాయి ప్రతిభ




**గజ్వేల్, ఆగస్టు 21 (వుదయం ప్రతినిధి)** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస' ప్రాజెక్ట్ ప్రదర్శనల్లో మైక్రోబయాలజీ, గణితశాస్త్రం, చరిత్ర విభాగాల్లో ఎంపికై తమ ప్రతిభను చాటారు. ఈ ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు తమ పరిశోధనలను విస్తృత వేదికపై ప్రదర్శించడంతో పాటు, ఇతర కళాశాలల విద్యార్థులతో ఆలోచనలు పంచుకోవడానికి, నూతన విషయాలు గ్రహించడానికి మంచి అవకాశం లభించింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, ప్రదర్శనా నైపుణ్యాలను పెంపొందించడానికి ఎంతో దోహదపడింది. రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు సద్ధం చేయడంలో మైక్రోబయాలజీ సూపర్‌వైజర్ శ్రీ రమణారెడ్డి, గణితశాస్త్ర సూపర్‌వైజర్ డా. కె. సరోజ, చరిత్ర సూపర్‌వైజర్ డా. పి. జయరాజు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం అభినందించారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## గోల్కొండ సమీపంలో వెలుగుచూసిన సొరంగం

**హైదరాబాద్:** చారిత్రక గోల్కొండ కోటకు సమీపంలోని అత్తారాసీడీలో కుతుబ్‌షాహీ కాలంనాటి పురాతన సొరంగం బయటపడింది. దీంతో స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ సొరంగ మార్గం ఎక్కడివరకు ఉంది?.. దీనిలో ఏమైనా చారిత్రక ఆనవాళ్లు బయటపడతాయా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. గోల్కొండ కోటకు ఆనుకుని ఉన్న అత్తారాసీడీ ప్రాంతం ఓపెన్‌గా నిర్మానుష్యంగా ఉంటుంది. అయితే ఇక్కడ అగ్నివీర్‌లకు శిక్షణ ఇచ్చేందుకు గోల్కొండ ఆర్టిలరీ అధికారులు గురువారం సాయంత్రం పొక్లెయిన్‌తో భూమిని చదును చేస్తుండగా సొరంగం బయటపడింది. దీంతో వెంటనే పనులను నిలిపివేసి కేంద్ర పురావస్తు శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే బయటపడ్డ సొరంగంపై పెద్దపెద్ద రాతి కడీలు కప్పిఉన్నాయి.

**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్:www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

**ఇ-వేలం నోటీసు నం.: Y/C.e-Auction/HYB/2025-26**
**తేది: 19-08-2026**

PUB/581

**భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్,** హైదరాబాద్ డివిజన్ పరిధిలో మొబైల్ ఆస్తులు, ఇతర స్థిర సేవలు, PMBJK మరియు అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరీలకు చెందిన వాణిజ్య ప్రచార కాంట్రాక్టులను కేటాయించడం కొరకు IREPS వెబ్‌సైట్ **www.ireps.gov.in** లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-వేలాన్ని ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూల్ వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**క్ర.సం. 1. కేటగిరీ:** ADVT-HYB-BMO-OSN-135-26-1 (ప్రకటనలు - OM స్టేషన్ ప్రాంగణం (నాన్ డిజిటల్)). **కేటలాగ్ నెం. :** HYB-MIXED-075. **వివరాలు:** RDN కేటగిరీ కింద స్టాటిక్ మీడియా ద్వారా స్టేషన్ ప్రాంగణంలో ప్రకటనల హక్కులు. **వేలం తేదీ:** 26-08-2026. **వేలం ప్రారంభ సమయం :** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:30.

**క్ర.సం. 2. కేటగిరీ :** MSS-HYB-FM-STGEn-103-25-1 (ఇతర స్థిర సేవలు -స్థిర సాధారణ). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-075. **వివరాలు :** ఫలక్‌నుమా స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఫుడ్ ట్రక్కుల నిర్వహణ మరియు మరమ్మత్తు (వినియోగదారులకు 24*7 సేవలు), ఫుడ్ ట్రక్కులు / చాట్ స్టాల్‌తో కూడిన జ్యూస్ బార్ / డ్రైవ్‌ఇన్‌లతో. వేలం తేదీ : 26-08-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:40.

**క్ర.సం. 3. కేటగిరీ:** MSS-HYB-STPD-PS-123-26-1 (ఇతర స్థిర సేవలు -ప్రీమియం స్టోర్స్). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-075. **వివరాలు:** మెట్టుగూడ రైల్వే ప్రాంగణంలోని సర్క్యులేటింగ్ ఏరియాలో ఉన్న ప్రీమియం బ్రాండ్ స్టోర్లు/స్టాళ్లు/అవుట్‌లెట్లు. **వేలం తేదీ:** 26-08-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:50.

**క్ర.సం. 4. కేటగిరీ:** MSS-HYB-BMO-STGEn-128-26-1 (ఇతర స్టాటిక్-సర్వీసెస్-స్టాటిక్ జనరల్). **కేటలాగ్ నెం.:** HYB-MSS-BMO. **వివరాలు:** బొలారం స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో ఫుడ్ ట్రక్కుల నిర్వహణ మరియు మరమ్మత్తు (వినియోగదారులకు 24*7 సేవలు), ఫుడ్ ట్రక్కులు / చాట్ స్టాల్‌తో కూడిన జ్యూస్ బార్ / డ్రైవ్‌ఇన్‌లతో. **వేలం తేదీ:** 31-08-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:30. **వేలం ముగింపు సమయం:** 12:00.

**క్ర.సం. 5. కేటగిరీ :** MSS-HYB-BMO-STGEn-127-26-1 (ఇతర స్టాటిక్-సర్వీసెస్- స్టాటిక్ జనరల్). **కేటలాగ్ నెం.:** HYB-MSS-BMO. **వివరాలు :** బొలారం స్టేషన్ (పశ్చిమ వైపు) LC 250 పక్కన ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో ఫుడ్ ట్రక్కుల (కస్టమర్లకు 24*7 సేవలు అందించే) నిర్వహణ మరియు మరమ్మత్తు. ఫుడ్ ట్రక్కులు / చాట్ స్టాల్‌తో కూడిన జ్యూస్ బార్ / డ్రైవ్‌ఇన్‌లతో. **వేలం తేదీ** 31-08-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:30. **వేలం ముగింపు సమయం:** 12:10.

**క్ర.సం. 6. కేటగిరీ:** ADVT-Int-206103-3-26-1 (ప్రకటనలు - రైలు లోపలి భాగం). **కేటలాగ్ నెం.:** HYB-NFR-077. **వివరాలు:** 20703/20704 నంబరు గల KCG-YPR-KCG వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇన్ఫోటైన్‌మెంట్ మ్యాగజైన్ పంపిణీకి కాంట్రాక్ట్. **వేలం తేదీ:** 01-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 15:00. **వేలం ముగింపు సమయం:** 15:30.

**క్ర.సం. 7. కేటగిరీ:** పార్కింగ్-HYB-SRNR-MX-113-6-1 MX-113-26-1 (పార్కింగ్-MIXED). **కేటలాగ్ నెం.:** HYB-PRKG-SRNR. **వివరాలు:** శ్రీరాంనగర్ (హైదరాబాద్ డివిజన్)లో ద్విచక్ర మరియు నాలుగు చక్రాల వాహనాల కోసం పార్కింగ్ స్థలం. విస్తీర్ణం 147 చదరపు మీటర్లు. **వేలం తేదీ:** 03-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 12:00. **వేలం ముగింపు సమయం:** 12:30.

**క్ర.సం. 8. కేటగిరీ:** ADVT-HYB-SFX-OH-124-25-1. (ఔట్ ఆఫ్ హోమ్ ప్రకటనలు). **కేటలాగ్ నెం.:** HYB-NFR-077. **వివరాలు:** సఫిల్‌గూడ, దయానంద్ నగర్, రామకృష్ణపురం రైల్వే స్టేషన్ వద్ద ఔట్ ఆఫ్ హోమ్ ప్రకటనల వర్గం కింద ప్రకటనల హక్కులు. **వేలం తేదీ:** 01-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 15:00. **వేలం ముగింపు సమయం:** 15:40.

**క్ర.సం. 9. కేటగిరీ:** ADVT-Int-202068-25-1. (రైలు లోపలి భాగం ప్రకటన, పూర్తి ముఖభాగం). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-076. **వివరాలు:** రైలు నెం.12789/12790 కాచిగూడ మురుడేశ్వర్-కాచిగూడ మరియు 22715/22716 కాచిగూడ-మధురై-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ యొక్క బయటి భాగం. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:30.

**క్ర.సం. 10. కేటగిరీ:** ADVT-Int-206103-226-1. (రైలు లోపలి ప్రకటన). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-076. **వివరాలు:** రైలు నెం.20703 / 20704 కాచిగూడ (KCG) యశ్వంత్‌పూర్ (YPR) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కోసం వినైల్ ర్యాపింగ్ ద్వారా ప్రకటన. ప్రకటనలు రైలు లోపల మాత్రమే ఇవ్వబడతాయి. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:40.

**క్ర.సం. 11. కేటగిరీ :** ADVT-EBW-324769-1-26-1. (రైలు బయటి భాగం (కిటికీ కింద) ప్రకటనలు). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-076. **వివరాలు:** రైలు నెం.12789/12790 కాచిగూడ-మురుడేశ్వర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ & రైలు నెం.22715-22716 బయటి భాగంలోని ప్రకటనలు. విస్తీర్ణం 3053.86 చ.మీ. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:50.

**క్ర.సం. 12. కేటగిరీ:** MSS-HYB-DYE-BS-95-25-1. (ఇతర స్థిర సేవలు-బ్యాటరీ మార్పిడి కేంద్రాలు). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-076. **వివరాలు:** దయానంద్ నగర్ రైల్వే స్టేషన్‌లో బ్యాటరీ మార్పిడి కాంట్రాక్ట్ సౌకర్యం. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 12:00.

**క్ర.సం. 13. కేటగిరీ :** MSS-HYB-UR-STGEn-121-26-1. (ఇతర స్థిర సేవలు-స్థిర సాధారణ). **కేటలాగ్ నెం.:** HYB-MIXED-074. **వివరాలు:** ఫుడ్ ట్రక్ నిర్వహణ మరియు మరమ్మత్తు (వినియోగదారులకు 24*7 సేవలు అందించేది), స్టేషన్ల పరిసర ప్రాంతంలో చాట్ స్టాల్ / డ్రైవ్‌ఇన్‌లతో కూడిన ఫుడ్ ట్రక్ / జ్యూస్ బార్. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 12:10.

**SI.No. 14. కేటగిరీ:** PMBJK-HYB-3-25-1. (PMBJK-ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలు). **కేటలాగ్ నం.:** HYB-PMBJK-MDNR. **వివరాలు:** MBNR రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాన్ని (PMBJK) ఏర్పాటుచేసి, నిర్వహించుట. **వేలం తేదీ:** 02-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 12:00. **వేలం ముగింపు సమయం:** 12:30.

**క్ర.సం. 15. కేటగిరీ:** MSS-HYB-BMO-GZ-125-26-1. (ఇతర స్థిర సేవలు - గేమింగ్ జోన్). **కేటలాగ్ నం.:** HYB-NFR-MIXED. **వివరాలు:** బొలారం రైల్వే స్టేషన్ వద్ద గేమింగ్ జోన్. **వేలం తేదీ:** 03-09-2026. **వేలం ప్రారంభ సమయం:** 11:00. **వేలం ముగింపు సమయం:** 11:30.

**A675** **సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్/హైదరాబాద్**

## కృత్రిమ మేధస్సు యుగంలో పబ్లిక్ రిలేషన్స్

**హైదరాబాద్, ఆగస్టు 21 (వుదయం) :**

48వ అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సు-2026 పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఒడిశా గవర్నర్ డా. హరిబాబు కంభంపాటి

తొలిసారిగా దాదాపు ఐదు దశాబ్దాల చరిత్రలో అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సుకు ఒడిశా ఆతిథ్యం

దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ నిపుణులు, కార్పొరేట్ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతల సమాగమం

'నవగుంజర - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ప్రజా సంబంధాలు' ఇతివృత్తంతో సదస్సు

ఒడిశా గౌరవ గవర్నర్ డా. హరిబాబు కంభంపాటి గురువారం రాజ్‌భవన్, భువనేశ్వర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 48వ అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సు-2026 (AIPRC2026) అధికారిక పోస్టర్ మరియు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (PRSI) ఆధ్వర్యంలో, PRSI భువనేశ్వర్ చాప్టర్ ఆతిథ్యంలో ఈ మూడు రోజుల జాతీయ సదస్సు 2026 డిసెంబర్ 25 నుంచి 27 వరకు భువనేశ్వర్‌లో నిర్వహించబడుతుంది.

పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా గవర్నర్ డా. హరిబాబు కంభంపాటి మాట్లాడుతూ, దాదాపు ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సుకు తొలిసారిగా ఒడిశా ఆతిథ్యం ఇవ్వడం ఎంతో గర్వకారణమన్నారు. ఒడిశా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే 'నవగుంజర' భావనను, కృత్రిమ మేధస్సు తీసుకువస్తున్న పరివర్తనాత్మక అవకాశాలతో అనుసంధానం చేయడం ఎంతో సముచితమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు విజయవంతం కావాలని PRSI, PRSI భువనేశ్వర్ చాప్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగ నిపుణులను, ప్రతినిధులను భువనేశ్వర్‌కు స్వాగతించేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు.

అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సు చరిత్రలో తొలిసారిగా ఒడిశా ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది. దేశవ్యాప్తంగా ప్రజా సంబంధాలు, కార్పొరేట్ కమ్యూనికేషన్, మీడియా, ప్రభుత్వం, వ్యాపార రంగం, విద్యా రంగం తదితర అనుబంధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

"నవగుంజర - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ప్రజా సంబంధాలు" అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ సదస్సు జరగనుంది. ఒడిశా ప్రసిద్ధ నవగుంజర ప్రతీక స్ఫూర్తితో రూపొందించిన ఈ ఇతివృత్తం, విభిన్న రూపాలు ఒకే సమగ్ర రూపంగా కలిసే భావనను ప్రతిబింబిస్తుంది. సాంకేతికత ఆధారిత కమ్యూనికేషన్ వాతావరణంలో విశ్వాసం, విశ్వసనీయత, ప్రతిష్ఠను నిర్మించేందుకు మానవ మేధస్సు, కృత్రిమ మేధస్సు, సృజనాత్మకత, నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహన, మానవీయత సమన్వయం అవసరమనే సందేశాన్ని ఈ ఇతివృత్తం అందిస్తుంది.



ఈ కార్యక్రమంలో PRSI జాతీయ అధ్యక్షులు డా. అజిత్ పాఠక్, PRSI సెక్రటరీ జనరల్ డా. పి.ఎల్.కె. మూర్తి, సదస్సు కన్వీనర్ డా. సంజయ్ కుమార్ సాహూ, కోకన్వీనర్ శ్రీ కృష్ణ చంద్ర మహాపాత్ర, PRSI భువనేశ్వర్ చాప్టర్ ట్రెజరర్ శ్రీ అన్సుమన్ పట్నాయక్ తదితర జాతీయ, ప్రాంతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

PRSI జాతీయ అధ్యక్షులు డా. అజిత్ పాఠక్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు అందిస్తున్న అవకాశాలను AIPRC2026 సమగ్రంగా చర్చించడంతో పాటు, ప్రజా సంబంధాల రంగంలో అత్యంత కీలకమైన నైతిక, సాంస్కృతిక, మానవీయ విలువలను పునరుద్ఘాటిస్తుందని అన్నారు. గొప్ప సాంస్కృతిక వారసత్వంతో పాటు సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదుగుతున్న భువనేశ్వర్ ఈ జాతీయ స్థాయి చర్చకు అత్యంత అనువైన వేదిక అని పేర్కొన్నారు.

AIPRC2026లో వృత్తిపరమైన జ్ఞానం, సాంకేతిక ఆవిష్కరణలతో పాటు ఒడిశా ప్రత్యేక సాంస్కృతిక వారసత్వం, కళలు, సంప్రదాయాలు, ఆతిథ్యాన్ని ఆస్వాదించే అవకాశం కూడా ప్రతినిధులకు లభించనుంది. ఈ నేపథ్యంలో AIPRC2026 వృత్తి నైపుణ్యం, సాంకేతిక విజ్ఞానం, సాంస్కృతిక వైవిధ్యాల సమ్మేళనంగా నిలవనుంది.

## నేడు విద్యుత్ కు అంతరాయం..



**మెదక్ , ఆగస్టు 21 (వుదయం) :** నిజాంపేట మండల పరిదిలోని బచ్చురాజ్‌పల్లి, నస్కల్, నిజాంపేట గ్రామాల పరిదిలోని 33/11 కేవీ మరమ్మత్ కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నాడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 3 గ్రామాల సబ్ స్టేషన్ పరిదిలో గల వ్యసాయ భూములకు 3 ఫేజీ విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు.

## చింత గింజలు గొంతులో ఇరుక్కొని బాలుడి మృతి

ఆదిలాబాద్: చింత గింజలు గొంతులో ఇరుక్కొని ఊపిరాడక ఏడేళ్ల బాలుడు మృత్యువాత పడ్డాడు. ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని కేఆర్కే కాలనీకి చెందిన మంగేశ్ అనే బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ చింతకాయలు నములుతున్నాడు. ఈ క్రమంలో అందులోని గింజలు ఒకేసారి గొంతులో ఇరుక్కుపోవడంతో బాలుడికి శ్వాస ఆడలేదు. కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేసినప్పటికీ ఎలాంటి ఫలితం దక్కలేదు. దీంతో బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## రైతులకు స్ప్రింక్లర్ పైపుల పంపిణీ
### నీటి పొదుపే లక్ష్యం: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి





నాగర్ కర్నూల్, ఆగస్టు 21 (వుదయం బ్యూరో): నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న స్ప్రింక్లర్ పైపులను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.

తాడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు స్ప్రింక్లర్ పైపులను అందజేశారు. అనంతరం బిజినపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజినపల్లి మండల రైతులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో స్ప్రింక్లర్ విధానం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని తెలిపారు.

స్ప్రింక్లర్ పైపుల వినియోగంతో నీటి పొదుపుతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుందని, పంటలకు సమానంగా నీరు అందుతుందని అన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, యంత్రాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు.

## వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలి
### – గడ్డపోతారం మున్సిపల్ చైర్ పర్సన్ గద్దె సుష్మా గణేష్



**జిన్నారం ఆగష్టు 21(వుదయం ప్రతినిధి ):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని గడ్డపోతారం మున్సిపల్ చైర్పర్సన్ గద్దె సుష్మ పిలుపునిచ్చారు. శుక్రవారం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం వార్డు కార్యాలయంలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా అధికారులు ప్రజాప్రతినిధులు మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, యువత మొక్కలను స్వీకరించారు. అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. వన మహోత్సవంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో, వైస్చైర్మన్ లక్ష్మగౌని మహేందర్ గౌడ్, కమిషనర్ తాన్య, కౌన్సిలర్ కుతాడి నవీన్, కోఆప్షన్ సభ్యురాలు రాయిసా ఖాతూన్, హెచ్ఎండీఏ ఉద్యానవన శాఖ ఏడీ చక్రపాణి, అటవీ శాఖ అధికారి దీపిక పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా విడుదల



జిన్నారం ఆగష్టు 21(వుదయం ప్రతినిధి) : జిన్నారం మున్సిపల్ లోని 5వ వార్డు పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో జాబితా విడుదలైనట్లు కౌన్సిలర్ శిల్పా నాగరాజు తెలిపారు. జాబితాలో పేరున్న లబ్ధిదారులు వెంటనే అవసరమైన పత్రాలు సమర్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దోమడుగులో గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యాయత్నం..



**గుమ్మడిదల ఆగస్ట్ 21 (వుదయం):** దోమడుగులో ఒక గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శుక్రవారం సదరు మహిళ డ్రైనేజీ కాలువలోకి వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన రైతు పాలాటి సత్తయ్య, మరొక యువకుడు సంపత్ ఈ విషయాన్ని గమనించి వెంటనే కాలువలోకి దిగి మహిళను బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను రక్షించారు. అయితే సదరు మహిళ ఎవరనేది, ఎక్కడి నుంచి వచ్చిందనేది తెలియరాలేదు. ఆమె స్థానికురాలు కాదని గ్రామస్థులు తెలిపారు. మహిళను గుర్తించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

## ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్తుల వినతి



**జిన్నారం ఆగష్టు 21(వుదయం ప్రతినిధి)** జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని మన చాయ్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ నరేందర్రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తే ప్రజలు, వాహనదారులు, పశువులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాన్స్ ఫార్మర్ను మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగరాజు యాదవ్ శ్రీనివాస్ గౌడ్ శ్రీధర్ గౌడ్ బ్రహ్మేంద్ర గౌడ్ రమేష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE IIIrd A.J.C.J, L.B.NAGAR,R.DIST,**
O.S.NO. 633 OF, 2026,
**Between :**
Adulla, Lalitha W/O,adulla Mahendar Reddy Age:57yrs,Occ:House hold, R/O, 8-1-18/5/1,Plot..No-2, Kranthinagar colony, Karmanghat,Saroornagar, Ranga Reddy Dist.T.G,State ...Petitioner/Plaintiff
**AND**
1.The Tahsildar, Saroornagar,Mandal, Ranga Reddy Dist,
2.All Concerned
…Respondent's / Defendants
Sub:-The above O.S.NO,633/2026,The Plaintiff filed Legal hair Certificat,due to The Respondents appear before the Honble court' On 17-09-2026,10.30. A.M,other wise the court will decide Exparte.
(AS PER THE COURT ORDER)
**Sd/-**
**P.Ram Mohan,**
**Counsel for Plaintiffs**
**9246796092**

**IN THE COURT OF THE CHAIRMAN MACT CUM CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD, TELANGANA**
M.V.O.P.No:931 OF 2026
**Between :**
Gutta Sudhakar ...Petitioner
**AND**
Durgesh Bangarappa & Others
…Respondents
1.Durgesh Bangarappa @ P.Durgaiah S/o; P. Bangarappa, Aged; 49 years, Occ; Driver, of Lorry bearing No; TS 12 UB 3021 R/o; Weaker Section H.No; 8, Kokapet, Rajendranagar, R.R. Dist ...R1
Whereas the above named Petitioners have filed the above O.P against you and another for compensation under the M.V Act.
Please take notice that the above O.P. stands posted to 06-10-2026 for your appearance , you are required to appear before Hon'ble Court at 10:30 am on the above date either in person or through an advocate, failing which the matter will be decided exparte.
//BY ORDER OF THE COURT//
**Sd/-**
**M/s K.V. RADHIKA**
**N.V.RAM PRASAD ADVOCATES**
**Flat no; 303, Chetan Residency, Lane No.2, Street No.6**
**Gaganmahal, Domalaguda Hyderabad.**

**IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: HYDERABAD.**
O.S.No. 2372 of 2026
**Between :**
Rasumalla Madhava Rao S/o Late Rasumalla Ramulu, aged 25 years, occ:Pvt. service, R/o H.No.15-5-791, Ashokbazar, Afzalgunj, Hyderabad. ...Plaintiff
**AND**
1. All concerned.
2.Tahsildar, Nampally Mandal, Hyderabad District. …Defendants
To
All concerned. ..Defendant No.1
Please take notice that the above named plaintiff filed the above suit to declare the status of the plaintiff as Legal heir of the deceased Rasumalla Ramulu who died on 4.10.2019. The above case is posted to 7.9.2026. If any person having any objection, they may approached to the said court on the said date at 10.30A.M. with their objections either in person or through their counsel. Otherwise the plaintiff's status will be declare as legal heir of the deceased.
//BY ORDER OF THE COURT//
**Sd/-**
**J. GOPALAKRISHNA**
**J. RAMADEVI,**
**K.Karamchander Reddy,**
**C.M.Praveen Raju,**
**Sheerin Muskaan,**
**J.Deepa, Advocates.**
**Cell: 9849006125,**
**Office at: H.No.1-1-111-1-35, Plot No.35, Shivapuri Colony, Kapra, AS Rao Nagar, Hyd-500062.**



మనకు ప్రధాని పోటీదారు చైనాయే...

"పాకిస్థాన్, చైనాతో మన దేశం యుద్ధాలు చేసింది. వాటితో సరిహద్దు వివాదాలూ ఉన్నాయి. అందువల్ల వాటిపై మనం దృష్టి సారిస్తూనే ఉంటాం. కానీ, ఈ రెండు దేశాలు పూర్తిగా భిన్నమైనవి. పాక్, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లలో తేడా ఉంటుంది. ప్రస్తుతానికి పాక్ నుంచి ఉగ్రవాద ముప్పు కొనసాగుతున్నందున ఆ దేశంపై భారత్ తక్షణ దృష్టి సారించింది. కానీ, దీర్ఘకాలంలో చైనా మనకు ప్రధాన పోటీదారు కాబోతోంది."

**- జనరల్ మనోజ్ నరవణె, ఆర్మీ మాజీ చీఫ్**

## వేమన పద్యం

**చెట్టుపాలు జనులు చేదందు రిలలోన**
**ఎనుపగొడ్డు పాలదెంత హితవు**
**పదుగురాడుమాట పాటియై ధరజెల్లు**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

## మనం సైంటిఫిక్‌గానే ఆలోచిస్తున్నామా?

స్వతంత్ర భారతం ఎనభయ్యవ పడిలో పడింది. ఇన్నేండ్ల స్వతంత్రం మన జాతి నేతల కలలను ఏ మేరకు నెరవేర్చింది? నాటి జాతీయోద్యమ దిక్సూచి సరైన దారిలోనే పయనిస్తోందా? ఇప్పటికైనా ప్రశ్నించుకోకపోతే ప్రశ్నే దేశ ద్రోహంగా మనల్ని వెక్కిరిస్తుంది. అప్పటివరకూ బ్రిటిష్ పీల్చి పిప్పిచేసిన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సైన్సును, సాంకేతికతను ఒక చోదకశక్తిగా ఎంచుకున్నారు. ఆ దిశగా చేసిన కృషి ఫలితంగానే మన దేశం పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో ముందడుగు వేసింది. శాస్త్ర రంగంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు ఐఐటీలను, పరిశోధనా సంస్థలను నెలకొల్పి ధీటైన శాస్త్రవేత్తలను, సాంకేతిక నిపుణులను రూపొందించటంలో మార్గదర్శనం చేసినవారు మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఆయనే ఒక సందర్భంలో మనం వందలాది శాస్త్రజ్ఞులను తయారు చేస్తున్నాం కాని వారిలో 'సైంటిఫిక్ టెంపర్' లోపిస్తున్నదని వాపోయాడు. సైంటిఫిక్ టెంపర్ అంటే ఏమిటి? శాస్త్రీయ స్పృహ, శాస్త్రీయ దృక్పథం. సమస్యలను అర్థం చేసుకోవటంలో హేతుబద్ధమైన ఆలోచన, క్రమబద్ధమైన విశ్లేషణ, శాస్త్రీయ పరిష్కారం. దీనికి మూలం ప్రశ్న, ప్రశ్నించటం. ప్రశ్నే విజ్ఞానానికి ద్వారం, జ్ఞానానికి తోవ. ఈ మార్గాన్ని వీడిన సమాజం అంధకార బంధురం. మన రాజ్యాంగం సైతం పౌరుల మౌలిక విధుల్లో దీన్ని పేర్కొనటం గమనార్హం. ఆర్టికల్ 51 Aలో ప్రతిపౌరుడూ మానవత్వాన్నీ, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని చెప్పింది. వీటిని ప్రోది చేసేందుకు మన మాటలు చేతలు దోహద పడాలని దీని సారాంశం. కాని గత కొన్నేండ్లలో జరిగినది? నేడు జరుగుతున్నదేమిటి? జాతీయోద్యము కాలం నుంచీ, ఆ మాటకొస్తే అంత కంటే ముందు నుంచే మన దేశంలో మూఢ విశ్వాసాల పై సమరం సాగుతున్నది. స్వాతంత్ర్యం సాధించిన ఏడు దశాబ్దాల తర్వాత దానికి గడ్డురోజులు వచ్చాయి. ప్రజల మనోభావాలు, విశ్వాసాల ముసుగులో మూఢత్వం వెర్రితలలు వేస్తోంది. అందుకు ఉదాహరణే 2013లో జరిగిన డా. నరేంద్ర ధబోల్కర్ హత్య. ఆయన ఒక ప్రజావైద్యుడు. అంతేకాదు, ఆయన 1989లో అంధశ్రద్ధా నిర్మూలన సమితిని స్థాపించాడు. సమాజంలో చేతబడులు లేదా బాణామతి, దొంగబాబాల బారినపడి కునారిల్లు తున్న పేద, మధ్యతరగతి ప్రజలకు సైన్సును వివరించాడు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని మహారాష్ట్రలో పెద్ద ఉద్యమమే నడిపాడు. ప్రజల్లో ఆయన కలిగిస్తున్న చైతన్యం చూసి గంగవెర్రులెత్తిన మూక ఆయన్ను 2013, ఆగస్టు 20న హత్యచేసింది. వ్యక్తిగా ఆయన్ను హత్యగావించినా ఆయన పోరాటం వృథా కాలేదు. ధబోల్కర్ మరణించిన కొని మాసాల్లోనే మహారాష్ట్ర అసెంబ్లీ మూఢవిస్వాసాల వ్యతిరేక చట్టం తెచ్చింది. ఆయన మరణించిన ఆగస్టు 20న మూఢనమ్మకాల వ్యతిరేక దినంగా మహారాష్ట్రలో పాటిస్తారు. అఖిలభారత సైన్సు నెట్‌వర్క్ ఈ రోజును శాస్త్రీయ దృక్పథం జనం లేదా సైంటిఫిక్ టెంపర్ డేగా దేశవ్యాపితంగా నిర్వహిస్తోంది. ధబోల్కర్‌నే కాకుండా మూఢ నమ్మకాలను ప్రశ్నించిన, వ్యవస్థపై ప్రశ్నలు సంధించిన ఎందరినో సమాజంలో మూఢ విశ్వాసాలు పరిఢవిల్లాలని కోరుకునే వారు పొట్టన పెట్టుకున్నారు. గౌరీ లంకేష్, గోవింద పన్సారేల హత్యలు అందులో భాగమే. ప్రశ్నించే వ్యక్తుల్ని మట్టుపెట్టడం ద్వారా ప్రశ్నకు, సైంటిఫిక్ టెంపర్‌కు సమాధి కట్టాలనుకుంటున్నారు. అది సాధ్యమయ్యే పనేనా? ముమ్మాటికీ కాదు. సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహించవలసిన ప్రభుత్వాలు, నేతలే అందుకు విరుద్ధంగా వ్యవహరించటం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. నెహ్రూకు వారసులం, అనుచరులమని చెప్పుకునే వారు సైతం ఇందుకు మినహాయింపు కాదు. అందుకు నాగార్జునసాగర్‌లో గతవారం జరిగిన వరుణయాగమే మంచి ఉదాహరణ. వర్షాలు వరుణుడు కరుణిస్తే వస్తున్నాయా? లేక ప్రకృతి సహజంగా రుతుపవనాల వలన పడుతున్నాయా? రుతుపవనాలను ప్రభావితం చేసి వర్షాలపై ప్రభావం చూపిన ఎల్‌నినో మాటేమిటి? వాతావరణ శాస్త్రం ఉత్తుత్తదేనా? మరిరోజూ ముందస్తుగా వాతావరణ సూచనలు ఇవ్వటం దేనికి? సైన్సును ఉపయోగించుకుం టూనే మళ్లీ తద్విరుద్ధంగా పూజలు చేయటం! అదీ రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి, మంత్రులూ. గతంలో ప్రభుత్వాలు మేఘమథనం చేసి వర్షాలు కురిపించే ప్రయత్నాలు చేశాయంటే అర్థం చేసుకోవచ్చు. సైంటిఫిక్ టెంపర్ లోపిస్తుందని నెహ్రూ వెలిబుచ్చిన ఆవేదన నేటి రాజకీయ వారసులకు తెలియదను కోవాలా లేక ప్రజలను మభ్యపెట్ట టంగా భావించాలా? ఇది ఏలిన వారికి ఎంతమాత్రం విహితం కాదు. సైంటిఫిక్ టెంపర్, హేతుబద్ధమైన ఆలోచనల నుంచి ప్రజలను దూరం చేస్తున్న నేటి తరుణంలో నిత్యజీవితంలో సైంటిఫిక్ టెంపర్ ఆవశ్యకత ను విడమర్చి చెప్పటం అత్యవస రం. మహారాష్ట్రలాగా మన రాష్ట్రం లో కూడా మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం రావాలి. దాన్ని ఆశించటం అత్యాశే అవుతుం దేమో! కాని ఆ కోణంలో సైన్సు సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ముమ్మరంగా సాగాల్సిన అవసం ఎంతైనా ఉంది.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# దిమాగీ నక్సలైట్‌లు అంటే మేధావులేనా?

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదాలు కూర్చటంలో, ప్రయోగించటంలో దిట్ట. ఆయనకు పొగడ్తలు తప్ప విమర్శలు నచ్చవు. ప్రజలు తమ బాధలగూర్చి, హక్కుల గూర్చి మాట్లాడటం అసలే గిట్టదు. పెట్టుబడి దారులకు పరమ మిత్రుడు; రైతులు, కార్మికులకు బద్ధ వ్యతిరేకి. గిట్టుబాటు ధరలకోసం నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న పంజాబ్ హర్యానా రైతులు నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి రాకుండా సరిహద్దుల్లోనే అణచివేత, నిర్బంధం. రైతులు ముందుకు రాకుండా రహదారిపై మేకులు కొట్టించిన తొలి ప్రభుత్వం మోదీ జీదే. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి మూడు రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకున్నాక కూడా ఆయనలో రైతుల పట్ల సానుభూతి పెరగలేదు. ఢిల్లీ వస్తున్న రైతులను పంజాబ్ సరిహద్దులలో పోలీసులు అడ్డుకున్నారు. పెట్టుబడిదారుల లాభాల కోసం 'వ్యాపారాలు సులభతరం' విధానం అమలు చేస్తున్న ప్రధాని మోదీ కార్మికుల సంఘటితశక్తిని, ఆ శక్తితో సాధించుకున్న హక్కులను హరించేందుకు 29 చట్టాలు రద్దుచేసి నాలుగు సంహితలను (కోడ్‌లు) చట్టాలుగా కూర్చారు. వాటికి వ్యతిరేకంగా నాలుగేళ్లుగా 10కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు నిర్విరామ ఆందోళన చేస్తున్నా, పలుమార్లు సార్వత్రిక సమ్మె చేసినా ఆయనకు చీమకుట్టినట్లు లేదు.

జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను హిందూత్వ సిద్ధాంతంలో పొదిగినారు. విద్య కేంద్రీకరణ, పోటీ పరీక్షలు కేంద్రీకరణ. పరీక్షల నిర్వహణలో తప్పులు, అవకతవకలు, అక్రమాలు, అవినీతి కేంద్రీకరణ. మరోవైపున మావోయిస్టులను (నక్సలైట్‌లకు) భౌతికంగా ఏరివేశామన్న ఉత్సాహం లో ఉన్న ప్రధాని మోదీ, ఆయన అనుంగుశిష్యుడు హోంమంత్రి అమిత్ షాలను




అనూహ్యమైన దెబ్బకొట్టారు కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆన్‌లైన్ పిలుపుపై జెన్ జీ యువత. ఈ నేపథ్యంలో, ఎర్రకోటనుంచి 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో ప్రధానమంత్రి యువతకు కొన్ని వరాలు ప్రకటించారు.

అదే సమయంలో 'దిమాగీ నక్సలైట్‌లు' అని కొత్త పదం ఉపయోగించారు. దీని అర్థం ఏమిటి మహాశయా అని దేశంలోని రాజకీయ స్పృహ కలిగిన విద్యావంతులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు. మోదీజీ సామాన్యంగా వ్యర్థ పదాలు (రాజకీయ సభల్లో తప్ప) ఉపయోగించరు. 'అడవుల్లోని నక్సలైట్లను ఏరివేస్తున్నాం పట్టణాల్లో నక్సలైట్‌లు మరీ ప్రమాదకారులని' గత సంవత్సరం హెచ్చరించిన మోదీ, ఇప్పుడు 'అడవుల్లోని నక్సలైట్లను ఏరివేశాం' అని ఘనంగా చెప్పుకుంటూ, 'దిమాగీ (మేధావులు, విద్యావంతులని అర్థం)నక్సలైట్ల' ప్రస్తావన చేశారు. వీరు ఇన్నాళ్లదాకా ప్రభుత్వంలో సలహాదారులుగా మావోయిస్టు భావజాలంతో విధానాలను ప్రభావితం చేశారట! ఇప్పుడు సమాజాన్ని ప్రభావితం చేయటం కొనసాగిస్తున్నా రట! 'వారు మన చుట్టూ ఉన్నారు, గుర్తించి ఏకాకులను చేయాలి' అన్నారు. వామపక్ష మేధావుల గూర్చి ప్రధాని ఈ పదం వాడారన్నది స్పష్టం. ఆ భావజాలం పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటున్నారంటే, ఇటీవల యువత, రైతులు, కార్మికుల ఆందోళనల వెనుక ఆ మేధావులు ఉన్నారనే అన్యాపదేశం స్ఫురిస్తుంది. వామపక్ష భావజాలాన్ని అణచివేసే పేరుతో యూనివర్శిటీల్లో హింసాత్మక దాడులు ప్రేరేపించటం, అందుకు ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపిలను ప్రోత్సహించటం చూశాం, చూస్తున్నాం. బయట వామపక్ష మేధావులకు మావోయిస్టులు, అర్బన్ నక్సల్స్ అనే ముద్రవేసి దేశద్రోహం, ప్రధాని హత్యకు కుట్ర వంటి ఆరోపణలు బనాయించి బెయిలుకు అవకాశంలేని జాతీయ భద్రత, ఉపా చట్టాల కింద అరెస్టు చేశారు. ఇది అసమ్మతిపై, భిన్నాభిప్రాయంపై దాడి. మానవ మేధస్సుకు, ప్రజాస్వామ్యానికీ విరుద్ధమైన శిలా సదృశ సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ వారి సిద్ధాంతం కదా! మత మార్గాల్లో దేశాన్ని విభజిస్తూ ఒకే ఆహార్యం, ఒకే భాష, శాఖాహారం, సనాతన ఆచారాలు, నమ్మకాల ఆరాధన సిద్ధాంతం అసమ్మతిని, నిరసనను సహించక పోవచ్చు. కాని ఈ 21వ శతాబ్దంలో నిరసనను అణచాలను కోవటం మూర్ఖత్వం. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం "దిమాగీ నక్సల్‌గా ఉండటానికి నేను గర్విస్తాను" అని ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఎస్టాబ్లిష్‌మెంట్‌ను కలవరపరిచినట్లుంది. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు హడావిడిగా మేల్కొని (తన ప్రకటనలోని వరుస సంఖ్యల్లో 3 అంకె లేకపోవటం సైతం గమనించలేదు) ప్రధాని వ్యాఖ్య ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఉద్దేశించింది కాదని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానమంత్రి బుర్రలోకి దూరి ప్రధాని వ్యాఖ్యలు "మావోయిస్టులను బలపరిచే వారికీ, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారికీ, వేర్పాటు వాదులను బలపరిచే వారికీ, ఆర్టికల్ 370ని బలపరిచేవారికీ, భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాలను వేరుచేసేందుకు చికెన్ నెక్ ప్రాంతాన్ని వేరుచేయా లని కోరేవారికీ వ్యతిరేకంగా" ఎక్కుపెట్టబడినట్లు వివరించారు. అయితే బిజెపి ఎంపి నిషికాంత్ దూబె, బిజెపి ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌లు చిదంబరంపై ఎదురుదాడికి దిగి అణుబాంబుపై గతంలో ఆయన ప్రకటన 'దిమాగీ నక్సల్' ప్రకటనగా ఉందని, యుపిఎ ప్రభుత్వంలో 'కాషాయ టెర్రరిజం ప్రాజెక్టుకు ఆయన కన్సల్టెంట్' అని నిందించారు. ప్రధాని ప్రకటన రాజకీయ ప్రత్యర్థులపై ఎక్కుపెట్టబడిందే నని వీరి వ్యాఖ్యలు చెబుతున్నాయి. జాతీయవాదులు, ప్రగతిశీలురు, వామపక్షవాదులు, నియంతృత్వ వ్యతిరేక ప్రజాస్వామ్యవాదులు ప్రధాని లేబుల్‌ను ముక్తకంఠంతో ఖండించాలి. విద్యారంగ సమస్యలపై మధ్యప్రదేశ్‌లో స్కూలు పిల్లలు సైతం తమంతటతాము ఉద్యమిస్తున్నారు. అది జన్ జీ జాతీయస్థాయి ఆందోళన తెచ్చిన చైతన్యం. దాన్ని ఆపటం ఎవరితరం కాదు అంటున్నారు. 'సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించాం. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారు' అంటూ ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కొత్త పార్టీ పుట్టుకొచ్చింది. మోదీ 'సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించాం. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారు' అంటూ ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కొత్త పార్టీ పుట్టుకొచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరిట ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షల మంది, ఎక్స్‌లో 7వేలమంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో 'దిమాగీ నక్సల్ పార్టీ' అని, ఎక్స్‌లో 'దిమాగీ నక్సల్ జనతా పార్టీ' అని ఖాతాలు తెరిచారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు 'ఓ దిమాగీ ఇండియన్' అని చెప్పుకొన్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఎప్పుడు సృష్టించారనేది స్పష్టత లేదుగానీ 'ఎక్స్' ఖాతాను మాత్రం ఈ నెలలోనే తెరిచారు. మరోవైపు, మోదీ చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. "ఆయన తన రాజకీయ ప్రత్యర్థులను తొలుత 'అర్బన్ నక్సల్స్' అన్నారు. ఇప్పుడు 'దిమాగీ నక్సల్స్' అని అంటున్నారు. మోదీలోని నిరాశానిస్పృహలను ఈ పదం తెలియ జేస్తోంది'' అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో విమర్శించారు. అవును.. నేను దిమాగీ నక్సల్‌నేనని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అన్నారు. నిజమైన దేశభక్తునిగా బీజేపీకి లొంగబోనని, దిమాగీ నక్సల్‌గా ఉండేందుకు గర్విస్తానని 'ఆప్' మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, విద్యా సంస్కరణల కోసం ఉద్యమిస్తున్న జన్ జీ యువతకు యోగా గురువు బాబా రామ్‌దేవ్ మద్దతు ప్రకటించారు. "విద్యా వ్యవస్థలో కుంభకోణం జరిగిందనేది అంగీకరించి బాధ్యులను శిక్షించండి. లేదంటే పోరాటంలోకి నేను కూడా దిగుతా''నని ఆయన హెచ్చరించారు.



నండూరి రవిశంకర్,
సీనియర్ జర్నలిస్ట్,
9912483642

## ఎటుపోతుంది సమాజం?

చదువుకోవాల్సిన వయసులో
చెడు దారులు ఎందుకు?
కలలు కనాల్సిన కళ్లలో
కలతలు ఎందుకు?
పుస్తకం పట్టాల్సిన చేతులు
పాశవికత్వాన్ని ఎందుకు
పట్టుకున్నాయి?
అక్షరాలు నేర్చాల్సిన మనసులు
అఘాయిత్యాలు ఎందుకు
నేర్చుకున్నాయి?
భవిష్యత్తుకు చుక్కానులు
కావాల్సిన చేతులు
'సుక్క'కు
బానిసలవుతున్నాయి
బంగారు బాటలు పట్టాల్సిన
అడుగులు
బీభత్సపు బాటలు
పడుతున్నాయి
మంచిని బోధించిన
గురువు...
మార్గాన్ని చూపిన గురువు...
తప్పును సరిదిద్దిన గురువు...
గౌరవం అందుకోవాల్సిన ఆ
చేతులకే
గాయం మిగిలిస్తే...
పాఠం చెప్పిన పెదవులపై
ప్రాణభయం మిగిలిస్తే...
విద్యాలయ గడపలోనే
విధ్వంసం మొదలైతే...
గురువు కన్నీటికి విలువెక్కడ?
విద్యకు అర్థమెక్కడ?
సమాజానికి భద్రతెక్కడ?
పాఠాలు వినాల్సిన చెవులు
పాపపు మాటలు ఎందుకు
వింటున్నాయి?
నీతిని నేర్పాల్సిన నోళ్లు
నిందను ఎందుకు
పలుకుతున్నాయి?
క్రమశిక్షణ క్రమం తప్పింది...
గౌరవం గడప దాటింది...
మానవత్వం మసకబారింది...
మంచితనం మట్టిలో
కలిసింది...
ఈర్ష్యే విద్యా?
ద్వేషమే ధ్యేయమా?
కోపమే ఆయుధమా?
హింసే పరిష్కారమా?
కాదు...
విద్య అంటే విజ్ఞానం మాత్రమే
కాదు...
వివేకం.
చదువు అంటే అక్షరాలు
మాత్రమే కాదు...
ఆలోచన.
గురువు అంటే పాఠం
చెప్పేవాడు మాత్రమే కాదు...
జీవితానికి దారి చూపే దీపం.
ఆ దీపాన్నే ఆర్పేస్తే
చీకటిలో నడిచేది ఒక్క ఇల్లు
కాదు...
ఒక తరం!
ఒక తప్పు
ఒక కుటుంబాన్ని
కుదిపేస్తుంది...
ఒక హింస
ఒక జీవితాన్ని ముగిస్తుంది...
కానీ...
ఒక చెడు ఆలోచన
ఒక తరాన్నే చీకటిలోకి
నడిపిస్తుంది!

రామిశెట్టి కావ్య
9390721569

# ఖనిజాలపై మన పట్టు

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న కొద్దీ అభివృద్ధికి అవసరమైన ముడి పదార్థాల స్వరూపం కూడా మారుతోంది. ఒకప్పుడు బొగ్గు, ఇనుము, చమురు పారిశ్రామిక ప్రగతికి ప్రధాన ఆధారాలైతే, ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, సౌర-పవన విద్యుత్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలు, అధునాతన ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలకు లిథియం, నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్, నియోడిమియం వంటి



కీలక ఖనిజాలు అవసరం. అందువల్ల అరుదైన ఖనిజాలు దేశ ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక భద్రతకు సంబంధించిన అంశాలుగా మారాయి. భవిష్యత్ అవసరాలు ఎంత వేగంగా పెరగనున్నాయో అంతర్జాతీయగణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం, 2024లో ప్రపంచ లిథియం డిమాండ్ దాదాపు 30 శాతం పెరిగింది; నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్, అరుదైన భూఖనిజాల డిమాండ్ కూడా 6-8 శాతం మేర పెరిగింది. ప్రస్తుత విధానాలు కొనసాగితే 2040 నాటికి లిథియం డిమాండ్ నేటితో పోలిస్తే మూడు రెట్లకు పైగా, గ్రాఫైట్, నికెల్ డిమాండ్ 50-90 శాతం మేర పెరగవచ్చని అంచనా. భారత్‌లోనూ అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. 2030 నాటికి అరుదైన భూఖనిజాలతో తయారయ్యే శాశ్వత మాగ్నెట్ల అవసరం 8,220 టన్నులకు చేరుతుందని అంచనా. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలకు 3,250 టన్నులు, విండ్ టర్బైన్లకు 1,800 టన్నులు, బీఎల్‌డీసీ ఫ్యాన్లకు 980 టన్నులు, స్మార్ట్‌ఫోన్లు-కంప్యూటర్లకు 600 టన్నుల అవసరం ఉంటుందని అంచనా. మరో అంచనా ప్రకారం ఈ మాగ్నెట్ల డిమాండ్ 2025లో 4,900 టన్నుల నుంచి 2030 నాటికి 12,500 టన్నులకు పెరగవచ్చు. ఈ నేపథ్యంలో అసలు సవాలు——భారత్ ప్రస్తుతం ఈ అవసరాలను ఎక్కడి నుంచి సమకూర్చుకుంటోంది, చైనాపై ఆధారపడటం ఎంతవరకు ఉంది? అన్నదే. నియోడిమియం-ఇనుము-బోరాన్ (ఎన్‌Fఎబ్) వంటి శాశ్వత మాగ్నెట్ల విషయంలో భారత్ దిగుమతులపై తీవ్రంగా ఆధారపడుతోంది. 2024-25లో భారత్ దిగుమతి చేసుకున్న శాశ్వత మాగ్నెట్లలో పరిమాణం పరంగా సుమారు 85-90 శాతం చైనా నుంచే వచ్చినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అరుదైన భూఖనిజ లోహాల దిగుమతుల్లోనూ చైనా వాటా గణనీయంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా అరుదైన భూఖనిజాల ప్రాసెసింగ్, రిఫైనింగ్, మాగ్నెట్ తయారీలో చైనాకు ఉన్న ఆధిపత్యం ఈ ఆధారాన్ని మరింత కీలకంగా చేస్తోంది. 2025లో చైనా కొన్ని అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతులపై ఆంక్షలు విధించడంతో భారత ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాల సరఫరా గొలుసుల్లో ఒత్తిడి ఏర్పడింది. అందువల్ల భారత్ దేశీయ అన్వేషణ నుంచి తవ్వకం, శుద్ధి, ప్రాసెసింగ్, మాగ్నెట్, బ్యాటరీ పదార్థాల తయారీ వరకు పూర్తి విలువ గొలుసును దేశంలోనే నిర్మించాలి. రిఫైనింగ్ యూనిట్లు, మాగ్నెట్ తయారీ, బ్యాటరీ పదార్థాల ఉత్పత్తి, అధునాతన భాగాల తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం అవసరం. పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమలు కలిసి పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. మూడోది సరఫరా వనరుల వైవిధ్యీకరణ. ఆస్ట్రేలియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ఆసియా దేశాలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు పెంచుకోవాలి. విదేశీ గనుల్లో భారత సంస్థల పెట్టుబడులకు దౌత్య, ఆర్థిక మద్దతు కల్పించాలి. అయితే చైనాపై ఉన్న ఆధారాన్ని మరో ఒక్క దేశంపైకి మార్చడం పరిష్కారం కాదు. బహుళ దేశాలతో విభిన్న సరఫరా గొలుసులు నిర్మించాలి. నాలుగోది రీసైక్లింగ్. పాత ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మాగ్నెట్లు, పారిశ్రామిక వ్యర్థాల నుంచి ఖనిజాలను తిరిగి పొందే సాంకేతికతపై పెట్టుబడులు పెంచాలి. భవిష్యత్తులో 'అర్బన్ మైనింగ్' కూడా దేశ ఖనిజ భద్రతలో ముఖ్య భాగం కావచ్చు. అదే సమయంలో తవ్వకాల పేరుతో పర్యావరణాన్ని విస్మరించరాదు. పారదర్శక అనుమతులు, శాస్త్రీయ పర్యావరణ అంచనాలు, నీటి వనరుల రక్షణ, స్థానిక ప్రజల హక్కులకు ప్రాధాన్యం ఉండాలి. నిజమైన స్వావలంబన అంటే గనులు కలిగి ఉండటం కాదు; అన్వేషణ నుంచి తవ్వకం, శుద్ధి, తయారీ, వినియోగం, రీసైక్లింగ్ వరకు పూర్తి విలువ గొలుసును దేశంలో నిర్మించడం. భవిష్యత్ డిమాండ్ వేగంగా పెరుగుతున్న వేళ ఇప్పుడే పెట్టుబడులు, పరిశోధన, భాగస్వామ్యాలు, ప్రాసెసింగ్ సామర్థ్యంపై దృష్టి పెడితే అరుదైన ఖనిజాలు భారత బలహీనతగా కాకుండా తదుపరి పారిశ్రామిక విప్లవానికి బలమైన పునాదిగా మారగలవు.



హెచ్.ప్రతాప్
77998 00773

# పౌరసత్వం కోసం పోరాటం

భారతదేశ ప్రజలమైన మేము..." - రాజ్యాంగంలోని ఈ ప్రారంభ పదాలు భారత గణతంత్రానికి పునాది అయిన ప్రజల సార్వభౌ మాధికారాన్ని ప్రతిబింబిస్తాయి. పౌరసత్వం ఎవరో ప్రసాదించే ప్రత్యేక హక్కు కాదు, అది సమాన హక్కు, సమాన గౌరవం, ప్రజాస్వా మ్యంలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే రాజ్యాంగ హోదా. ఈ నేపథ్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'పై సుప్రీంకోర్టు చేసిన స్పష్టీకరణకు ప్రాధాన్యత ఉంది. సర్ పౌరసత్వాన్ని నిర్ణయించే ప్రక్రియ కాదని, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం రద్దుకాదని కోర్టు పేర్కొంది. అయితే ఓటర్ల జాబితా పరిశీలనను పౌరసత్వం, ఇతర హక్కులతో ముడిపెట్టే ప్రయత్నాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. 2026 జూలై 17న సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు కీలకమైన సమయంలో వచ్చాయి. ఎన్నికల పరిశీలన, పౌరసత్వం, దానికి సంబంధించిన ఇతర హక్కుల మధ్య సంబంధం ఏర్పడుతుందనే భయాలు ప్రజల్లో పెరుగుతున్నాయి. అదే సమయంలో సర్ ప్రక్రియకు గతంలో కోర్టు ఇచ్చిన ఆమోదాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రెండు భిన్న జాతీయత భావనలుసర్‌ను భారతదేశ స్వరూపంపై జరుగుతున్న సిద్ధాంతపరమైన పోరాటం నుంచి వేరుచేసి చూడలేం. రాజ్యాంగం భారతదేశాన్ని ప్రజల సార్వభౌమాధికారంపై ఆధారపడిన గణతంత్రంగా నిర్వచించింది. మతం, కులం, సామాజిక నేపథ్యం ఏదైనా ప్రతి పౌరుడికి సమాన



రాజకీయ హక్కులు ఉండాలని రాజ్యాంగం నిర్దేశించింది. మరోవైపు ఎం.ఎస్. గోల్వాల్కర్ రచించిన "We, or Our Nationhood Defined"లో భారతదేశాన్ని ప్రధానంగా హిందూ జాతిగా చూసే భావనను ప్రతిపాదించారు. ఈ దృక్పథంలో జాతీయ గుర్తింపు రాజ్యాంగపరమైన పౌరసత్వంకంటే సాంస్కృతిక అనుబంధంపై ఎక్కువగా

**పౌరసత్వం ఎవరో ప్రసాదించే ప్రత్యేక హక్కు కాదు, అది సమాన హక్కు, సమాన గౌరవం, ప్రజాస్వా మ్యంలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే రాజ్యాంగ హోదా. ఈ నేపథ్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'పై సుప్రీంకోర్**

ఆధారపడి ఉంటుంది. ఈ రెండు భావనల మధ్య తేడా, గత కొన్నేండ్లుగా పౌరసత్వానికి సంబంధించి జరుగుతున్న వివిధ చర్యలను అర్థం చేసుకోవడం కీలకం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.. సావర్కర్, జిన్నాల జాతీయత భావనలను ప్రస్తావిస్తూ, ఇద్దరూ భారతదేశంలో హిందూ, ముస్లిం అనే రెండు జాతులున్నాయనే విషయంలో ఏకీభవించారు. సార్వత్రిక ఓటుహక్కు - ప్రజాస్వామ్యానికి పునాదిరాజ్యాంగంలోని ఆర్టికల్ 325 మతం, జాతి, కులం, లింగం ఆధారంగా ఓటర్ల జాబితాలో చేర్చకుండా నిరాకరిం చడాన్ని అడ్డుకుంటుంది. ఆర్టికల్ 326 సార్వత్రిక ఓటుహక్కును హామీ ఇస్తుంది. అందువల్ల ఓటు హక్కు ప్రజలు తమ సార్వభౌమా ధికారాన్ని వినియోగించుకునే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఢిల్లీ జీబీ రోడ్‌కు చెందిన రీటా అనే సెక్స్‌వర్కర్ తన ఓటు తనను "ఏదో ఒకరకంగా సమానమైన వ్యక్తిగా భావించేలా చేస్తుంది" అని చెప్పడం దీనికి ఉదాహరణ.



# జాతీయం-అంతర్జాతీయం



## రాజకీయ శాస్త్రానికి ఆరెస్సెస్ చెదలు

- పాఠ్యపుస్తకాల రూపకల్పనకు కొత్త బృందం
- ఎన్‌సీఈఆర్‌టీ కొత్త కమిటీలోఆరెస్సెస్, ఏబీవీపీ నేపథ్యం ఉన్నవారికి చోటు
- పలు విశ్వవిద్యాలయాల నుంచి సభ్యులు
- పాఠ్యాంశాల తటస్థతపై విద్యావేత్తల నుంచి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్) :** దేశ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే పాఠ్యపుస్తకాలపై భావజాల ముద్ర వేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. 11, 12 తరగతుల రాజకీయ శాస్త్ర (పొలిటికల్ సైన్స్) పాఠ్యపుస్తకాలను రూపొందించేందుకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) పునర్‌వ్యవస్థీకరించిన కమిటీలో ఆరెస్సెస్, దాని విద్యార్థి విభాగం ఏబీవీపీ, బీజేపీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలున్న వ్యక్తులకు చోటు దక్కింది. అంతేకాదు.. కొత్త పాఠ్యపుస్తకాల్లో 'సాంస్కృతిక మూలాలు', 'భారతీయ జ్ఞాన వ్యవస్థలు', 'సమగ్రత' వంటి అంశాలను అంతర్భాగం చేయాలని కమిటీకి ఆదేశాలూ అందాయి. దీంతో సంఘ్ అనుబంధ వ్యక్తులకు కమిటీలో చోటు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో రాజకీయ భావజాలానికి అతీతమైన శాస్త్రీయత, తటస్థతతో కూడిన విద్యా ప్రమాణాలు అవసరమని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు చెప్తున్న వేళ ఈ నియామకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ శాస్త్ర పాఠ్యపుస్తకాలను కొత్తగా రూపొందించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్‌ను పునర్‌వ్యవస్థీకరించింది. ఈ కమిటీ 11వ తరగతి పాఠ్యపుస్తకాన్ని నవంబర్‌లోగా, 12వ తరగతి పుస్తకాన్ని వచ్చే ఏడాది జులైలోగా సిద్ధం చేయాల్సి ఉంది. కర్నాటకకు చెందిన నిట్టే డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్, విద్యావేత్త, రాజకీయ విశ్లేషకుడు సందీప్ శాస్త్రి కమిటీకి నేతృత్వం వహించనున్నారు. అయితే ఈ కమిటీలోని



కనీసం నలుగురు సభ్యులకు ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఏబీవీపీ, బీజేపీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలున్నట్టు పలు ఆధారాలు ఉన్నాయి. కేంద్ర విద్యాశాఖలో సీనియర్ కన్సల్టెంట్‌గా ఉన్న యదునాథ్ దేశ్‌పాండే గతంలో మహారాష్ట్రలో ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పనిచేసినట్టు ఆ సంస్థ రికార్డులు పేర్కొంటున్నాయి. అనంతరం ముంబయికొంకణ్ ప్రాంతంలోనూ ఏబీవీపీలో బాధ్యతలు నిర్వహించారు.

ఆయన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో బీజేపీ రాజకీయ సలహాదారుగా కూడా తనను తాను పేర్కొన్నారు. ఇక ప్రశాంత్ దివేకర్‌కు ఆరెస్సెస్‌తో అనుబంధం ఉన్న పూణేకు చెందిన జ్ఞానప్రబోధినితో దీర్ఘకాలిక సంబంధం ఉన్నట్టు తెలిసింది. భారతీయ విద్యా తత్వశాస్త్రంలో తన విధానం వేళ్లూనుకున్నదని ఆయన నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్ పోర్టల్‌లో పేర్కొన్నారు. జేఎన్‌యూ సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్ ప్రొఫెసర్ వందన మిశ్రా గతంలో ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా పని చేశారు.అదే విధంగా జేఎన్‌యూకి చెందిన రవి రామచంద్ర శుక్లా ఆరెస్సెస్ అనుబంధ సంస్థగా పేర్కొన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్‌షిప్-రంభావు మ్హాల్గీ ప్రబోధిని ప్రచురించే ఇండియన్ జర్నల్ ఆఫ్ డెమొక్రాటిక్ గవర్నెన్స్ సంపాదక మండలిలో పనిచేశారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక జాతీయ వాదంపై ఆయన పరిశోధనలు కూడా చేశారు. ఇక ఈ కమిటీలో జేఎన్‌యూ, నేషనల్ లా యూనివర్సిటీ, చాణక్య యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, ఇగ్నో, జిందాల్ గ్లోబల్ లా స్కూల్, పాండిచ్చేరి యూనివర్సిటీ, ఉత్కళ యూనివర్సిటీ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యావేత్తలకు చోటు కల్పించారు. ప్రకాశ్ కంద్‌పాల్, నీధి గుప్తా, చేతన్ సింఘాయ్, సుకన్నికా వత్స, సతీశ్ కుమార్, దేవాంశు శ్రీవాస్తవ, ప్రణవ్ గుప్తా, నంద కిశోర్, స్వప్న ప్రభు తదితరులు కమిటీలో ఉన్నారు. ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన వాన్తాంగ్‌పుయి ఖోబంగ్, సుభాష్ సింగ్ వరుసగా సభ్య సమన్వయకర్త, సహ సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ నోటిఫికేషన్ ప్రకారం... సామాజిక శాస్త్రాలు, భాషలు, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, పర్యావరణ విద్య, వినూత్న బోధనా పద్ధతులు, బోధనఅభ్యసనకు సంబంధించిన కరిక్యులర్ ఏరియా గ్రూపుల మార్గదర్శకత్వాన్ని కమిటీ తీసుకోనుంది. ఇతర తరగతుల పాఠ్యాంశాలతో అనుసంధానం, వివిధ సబ్జెక్టుల మధ్య అంతరశాస్త్రీయ సంబంధాలు, బహుభాషా దృక్కోణాలను కూడా పరిగణనలో కి తీసుకోనుంది. ప్రతి పాఠ్యపుస్తకాన్ని సమీక్షించే సమయంలో సాంస్కృతిక మూలాలు, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, సమగ్రత, విద్యా సాంకేతికత, మూల్యాంకనం వంటి అంశాలను ఎలా పొందుపరిచారో పరిశీలించాలని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా రాజకీయ శాస్త్రం వంటి కీలక సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఆరెస్సెస్, ఏబీవీపీ నేపథ్యాలున్న వ్యక్తులకు ప్రాధాన్యం లభించడం విద్యా రంగంలో పాఠ్యాంశాల తటస్థత, వైవిధ్యంపై చర్చకు దారితీసే అంశంగా మారింది

## అమెరికాలో భారతీయుల ఘనత..

- 1,383 జెండాలతో గిన్నిస్ వరల్డ్ రికార్డు

**వాషింగ్టన్, ఆగస్టు 21:** అమెరికాలో నివసిస్తున్న భారతీయుల సత్తా మరోసారి ప్రపంచస్థాయిలో చాటుకుంది. న్యూజెర్సీలోని పార్సిప్పనీ పట్టణంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. మొత్తం 1,383 అమెరికా జెండాలను ఫ్లాగ్‌పోల్స్‌పై ఏర్పాటు చేసి భారీ స్థాయిలో '250' అనే సంఖ్యను రూపొందించడం ద్వారా 'లార్జెస్ట్ ఫ్లాగ్‌పోల్ నంబర్' విభాగంలో కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆగస్ట్ 15వ తేదీన పార్సిప్పనీ, న్యూజెర్సీలోని వెటరన్స్ మెమోరియల్ పార్క్‌లో ఈ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమం నిర్వహించారు. అమెరికా జెండాలతో రూపొందించిన భారీ 250 సంఖ్య చుట్టూ భారత త్రివర్ణ పతాకాలను ఏర్పాటు చేశారు. భారత్, అమెరికా దేశాల చారిత్రక సంబంధాలు, ఇరు దేశాల స్వాతంత్ర్య వేడుకలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ వేడుకను India@80, America@250 అనే రెండు వార్షికోత్సవాల నేపథ్యంలో నిర్వహించారు.

ఈ రికార్డు ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించి ధ్రువీకరించారు. ఆ తర్వాత అధికారిక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రికార్డు సర్టిఫికెట్‌ను ఎఫ్ఐఏ నాయకులు అందజేశారు. దీంతో ఈ కార్యక్రమం భారతీయఅమెరికన్ సమాజానికి



ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ఈ గిన్నిస్ రికార్డు భారతీయ సమాజం ఐక్యత, వారసత్వంపై ఉన్న గర్వానికి నిదర్శనమని ఎఫ్ఐఏ ఛైర్మన్ అంకుర్ వైద్య తెలిపారు. అందరూ ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేస్తే ఎంతటి అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చో ఈ రికార్డు నిరూపించిందని పేర్కొన్నారు.

ఈ రికార్డు భారత్‌అమెరికా వ్యూహాత్మక స్నేహానికి ప్రతీకగా నిలుస్తుందని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ అంబాసిడర్ బినయ శ్రీకాంత ప్రధాన్ తెలిపారు. రెండు ప్రజాస్వామ్య దేశాలను కలుపుతున్న భారతీయఅమెరికన్ ప్రవాస సమాజానికి ఇది ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. పార్సిప్పనీ మేయర్ పుల్కిత్ దేశాయ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని భారత్, అమెరికా మధ్య ఉన్న సారూప్యతను ప్రస్తావించారు. న్యూజెర్సీ లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ డేల్ జీ. కాల్డ్‌వెల్ కార్యక్రమం వెనుక ఉన్న భారీ స్వచ్ఛంద సేవా కృషిని ప్రశంసించారు.

ఈ ప్రపంచ రికార్డు ఒక్క సంస్థకు మాత్రమే చెందదని, కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి వాలంటీర్, భాగస్వామి, మద్దతుదారుడి విజయమని ఎఫ్ఐఏ అధ్యక్షుడు శ్రీకాంత్ అక్కపల్లి తెలిపారు. భారీ సంఖ్యలో ఫ్లాగ్‌పోల్స్‌తో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఐక్యత, దేశభక్తి, ప్రపంచ సమైక్యతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు గిన్నిస్ రికార్డు సాధించిన భారీ జెండా ప్రదర్శనను ప్రజలకు చూపించారు. 1970లో స్థాపించబడిన ఎఫ్ఐఏ.. అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాల్లో భారతీయఅమెరికన్ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రముఖ



## సోమాలియా తీరంలో నౌక హైజాక్

**మొగాడిసు, ఆగస్టు 21 :** సోమాలియా తీరంలో హైజాక్ అయిన, తుర్కియే ఆయుధాలను తరలిస్తున్న కార్గో నౌకలోని 10 మంది సిబ్బందిలో ఆరుగురు భారతీయులు ఉన్నారు. ఈ నౌక మొగడిషూలోని సైనిక శిక్షణా కేంద్రానికి ఆయుధాలు, కమ్యూనికేషన్, శాటిలైట్ పరికరాలను తరలిస్తోంది. సోమాలియాలో సముద్రపు దొంగల బారిన పడిన కామెరూన్ పతాకంతో వెళ్తున్న కార్గో నౌకలో ఆరుగురు భారతీయులు ఉన్నారని ఓ సోమాలి అధికారి తెలిపారు. దీనిపై భారత విదేశీ వ్యవహారాల శాఖ ఇంకా స్పందించలేదు.

## కల్తీ మద్యం తాగి 8 మంది మృతి



- గుజరాత్‌లో దుర్ఘటన

**గాంధీనగర్, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్) :** కల్తీ మద్యం తాగి 8మంది మృతి చెందగా, మరో 25మంది తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. ఈ ఘటన శుక్రవారం గుజరాత్ రాష్ట్రం భావ్‌నగర్‌లో జరిగింది. భావ్‌నగర్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ అక్షర్ వ్యాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అధికార యంత్రాంగం రికార్డుల ప్రకారం మొత్తం 61 మంది బాధితులను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 10 మంది గురువారమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మరో 18 మంది ఆసుపత్రికి వచ్చినప్పటికీ, వైద్యుల పరిశీలనలో వారికి ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని తేలింది. తమ రికార్డుల ప్రకారం ఎనిమిది మంది మృతి చెందారని ఆయన తెలియజేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశామని, బాధితుల రక్త నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ అందజేశామని, నివేదికలు అందిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

మద్య నిషేధం అమల్లో ఉన్న గుజరాత్ లో ఈ ఘటన జరగటం చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా.. అప్పుల కుప్ప

- 40 ట్రిలియన్ డాలర్లకు చేరిన రుణం
- వెంటాడుతున్న వడ్డీ భూతం
- భయపెడుతున్న ద్రవ్య లోటు
- కీలక రంగాలకు నిధుల కొరత
- సన్నగిల్లుతున్న ఇన్వెస్టర్ల విశ్వాసం

**వాషింగ్టన్, ఆగస్టు 21 :** అగ్రరాజ్యంగా చెప్పుకునే అమెరికా ఇప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ఆర్థిక శాఖ డేటా ప్రకారం ఫెడరల్ అప్పు మంగళవారం 40 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇది అమెరికా ప్రజలకు ఎంతమాత్రం శుభవార్త కాదు. రుణభారం రాబోయే సంవత్సరాలలో ప్రజల పైన, వ్యాపారాల పైన తీవ్రంగా ప్రభావం చూపుతుంది. వాస్తవానికి అమెరికా చాలా కాలం నుంచే రుణభారాన్ని మోస్తోంది. అయితే ఇటీవలి కాలంలో వ్యక్తమవుతున్న అనేక ధోరణులు బడ్జెట్, ఆర్థిక మార్కెట్ల నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎందుకంటే గత కొన్ని సంవత్సరాలుగా అప్పుల భారం వేగంగా పెరుగుతోంది. ఓ వైపు వడ్డీ రేట్లు, మరో వైపు రుణాలు పెరుగుతుండడంతో తీసుకున్న అప్పులపై చెల్లించాల్సిన వడ్డీ కొండలా పెరిగిపోతోంది.భారంగా మారుతున్న వృద్ధులు'పరిస్థితి ఇలాగే కొనసాగితే కేవలం ఆరు సంవత్సరాల కాలంలోనే రుణభారం యాభై ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది. పది సంవత్సరాల క్రితం ఫెడరల్ అప్పులు కేవలం 20 ట్రిలియన్ డాలర్లే. ఇప్పుడు మనం నిజంగా మన ఆర్థిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నాం' అని పీటర్ జి.పీటర్సన్ ఫౌండేషన్ అనే ఫిస్కల్ వాచ్‌డాగ్ గ్రూప్ సీఈఓ మైకెల్ పీటర్సన్ తెలిపారు. అమెరికాలో వేగంగా పెరుగుతున్న రుణభారానికి చాలా కారణాలు కన్పిస్తున్నాయి.

వీటిలో ముఖ్యమైన కారణమేమంటే దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య పెరగడం. ప్రతి రోజూ దేశంలో పది వేల మంది బేబీ బూమర్లు (రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1946 - 1964 మధ్య జన్మించిన వారు) పదవీ విరమణ చేస్తున్నారు. మరోవైపు సీనియర్ సిటిజన్ల జీవితకాలం పెరుగుతోంది. ఫలితంగా సామాజిక భద్రత, మెడికేర్‌పై ఫెడరల్ ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అయితే ఈ మౌలిక సదుపాయాల పథకాల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉంది.ఆదాయానికి మించిన వ్యయంఇక్కడ మరో కారణం కూడా కన్పిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా పన్నులను తగిస్తూ, ఖర్చుల్ని పెంచే ప్యాకేజీలను కాంగ్రెస్ ఆమోదిస్తోంది. 2017లో వచ్చిన పన్ను కోతలు - ఉద్యోగాల చట్టం, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో గత సంవత్సరం వచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్, ట్రంప్‌తో పాటు మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో ముందుకు తెచ్చిన అనేక కోవిడ్ - 19 మహమ్మారి సహాయక బిల్లులు ఈ కోవలోకే వస్తాయి. వీటి కారణంగా ఫెడరల్ రుణం కాలక్రమేణా అనేక ట్రిలియన్ డాలర్ల మేర పెరుగుతుందని అంచనా. కొన్ని సంవత్సరాల క్రితం ఊహించిన దాని కంటే ముందే రుణభారం 40 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంది. అప్పుల భారం 2028 నాటికి 40 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని 2023 మేలో కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది.




అప్పుల పరిమాణం, అది పెరుగుతున్న వేగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆర్థిక శాఖ డేటా ప్రకారం కేవలం గడచిన ఐదు నెలల కాలంలోనే జాతీయ అప్పు ఒక ట్రిలియన్ డాలర్లు పెరిగింది. ఫెడరల్ ప్రభుత్వ ఆదాయంతో పోలిస్తే ఖర్చే ఎక్కువగా ఉంటోంది. సెప్టెంబర్ 30తో ఈ ఆర్థిక సంవత్సరం ముగియాల్సి ఉండగా మొదటి పది నెలల కాలంలోనే ద్రవ్య లోటు 1.8 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. బాండ్ మార్కెట్‌పై ప్రభావంపెరుగుతున్న రుణం బాండ్ మార్కెట్ పైన, వడ్డీ రేట్ల పైన ప్రభావం చూపుతోంది. 2007 తర్వాత ట్రెజరీ ఈల్డ్ (ప్రభుత్వం తన అవసరాల కోసం ప్రజలు లేదా సంస్థల నుంచి తీసుకునే అప్పుపై చెల్లించే వడ్డీ రేటు) మంగళవారం అత్యధిక స్థాయికి చేరుకుంది. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, పెరుగుతున్న ద్రవ్య లోటు, కార్పొరేట్ బాండ్ల సరఫరా పెరగడం, వడ్డీ రేట్లకు సంబంధించి ఫెడరల్ రిజర్వ్ అనుసరిస్తున్న వైఖరిపై అనిశ్చితి వంటి అంశాలపై పెట్టుబడిదారుల అంచనాలే ఈల్డ్ పెరుగుదలకు కారణం. ఫెడరల్ రుణభారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వానికి అప్పులు ఇచ్చేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా అధిక వడ్డీ రేటును ఆశిస్తున్నారు. పెరిగిన వడ్డీ రేట్లు గృహ, వాహన, వ్యాపార రుణాల రేట్లను ప్రభావితం చేస్తున్నాయి. వినియోగదారులపై భారం పడడమే కాకుండా వ్యాపార పెట్టుబడులు కూడా పరిమితం అవుతున్నాయి. అప్పు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది. బడ్జెట్‌లోని ప్రాధాన్యతాంశాలు పక్కకు పోతాయి. ఏదేమైనా పెరుగుతున్న అప్పుల భారం ట్రంప్ ప్రభుత్వాన్ని కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.ఓ వైపు అప్పులు పెరుగుతుంటే మరోవైపు వాటిపై చెల్లించాల్సిన వడ్డీ రేటు కూడా పెరిగిపోతోంది. దీంతో వడ్డీ చెల్లింపుల్లో భారీ పెరుగుదల కన్పిస్తోంది. గతంలో తక్కువ వడ్డీ రేటుకే ప్రభుత్వానికి తేలికగా అప్పులు పుట్టేవి. అయితే కోవిడ్ మహమ్మారి రాకతో పరిస్థితి మారిపోయింది. ఆ కాలంలో దేశంలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండడంతో పరిస్థితిని ఎదుర్కోవడానికి ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపులు ఒక ట్రిలియన్ డాలర్లు దాటవచ్చునని అంచనా. ఇది ఓ రికార్డు స్థాయి. గత ఐదు సంవత్సరాలలో ఫెడరల్ ఖర్చులు మూడు రెట్లకు పైగా పెరిగాయి. ప్రభుత్వ వ్యయంలో సామాజిక భద్రతది మొదటి స్థానమైతే మెడికేర్‌ది రెండో స్థానం. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ రక్షణ కోసం కంటే వడ్డీ చెల్లింపులకే అమెరికా ఎక్కువగా ఖర్చు చేస్తోంది. మరో మాటలో చెప్పాలంటే చిన్నారుల కార్యక్రమాలతో పోలిస్తే వడ్డీ చెల్లింపుల కోసమే యాభై శాతం అధికంగా ఖర్చు పెడుతోంది. వడ్డీ చెల్లింపులు అధికం కావడంతో ఇతర ఫెడరల్ కార్యక్రమాలకు, ప్రాధాన్యతలకు మద్దతు ఇవ్వడం ప్రభుత్వానికి కష్టంగా మారింది. భవిష్యత్తులో పెట్టుబడులు పెట్టడం మాట అటుంచి గతంలో తీసుకున్న రుణాలను ఎలా తీర్చాలనే విషయం పైనే ప్రభుత్వం ఎక్కువగా ఆలోచిస్తోంది. తీసుకున్న అప్పు మరింత రుణాన్ని సృష్టిస్తోందే తప్ప అది తీరే పరిస్థితి కన్పించడం లేదు. సమతుల్యత లోపించిన దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో క్రెడిట్ రేటింగులు పడిపోయాయి.ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గాయపడిన సైనికుల సంఖ్య 750 దాటిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైన తర్వాత 18 మంది సైనికులు చనిపోయారని, 757 మంది క్షతగాత్రులయ్యారని వివరించింది. ఇరాన్, అమెరికా మధ్య చర్చల విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో రక్షణ శాఖ తన యుద్ధ నష్టాల డేటాబేస్‌ను విడుదల చేసింది. ఇరాన్ దాడులలో మరణించిన లేదా గాయపడిన సైనికుల సంఖ్యను పెంటగాన్ తగ్గించి చూపుతోందంటూ చట్టసభ సభ్యులు పదే పదే విమర్శలు కురిపించారు. దీంతో ఈ తాజా సమాచారం విడుదలైంది. గత నెలలో విడుదల చేసిన గణాంకాలలో మరణాలను, క్షతగాత్రుల సంఖ్యను తగ్గించి చూపి ఆ తర్వాత డేటాను సరిచేశారు.




## పార్లమెంటు పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ ధర్నా



- విద్యార్థులపై కాల్పులు జరిపిన సిబ్బందిపై చర్యలకు డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్ :** ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జూలై 20 నాటి నిరసనలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు పోలీసులు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని కూడా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

గత నెల జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పార్లమెంట్ మార్చ్ కు శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 19 ఏళ్ల సాహిల్ కు తీవ్ర గాయాలైయ్యాయి. శుక్రవారం బాధితునితో కలిసి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సాహిల్ ఆరోపించాడు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ వెలుపల ధర్నాకు కూర్చున్నారు.

## మూడేండ్ల తర్వాత బస్సు సర్వీసు

- ఇంఫాల్ -గువహటి మధ్య ప్రారంభం

**గువహటి, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్) :** మూడేళ్ల తర్వాత ఇంఫాల్‌గువహటి బస్సు సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. నాగాలాండ్‌లోని దిమాపూర్ మీదుగా ఈ సర్వీస్ వెళ్లనుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మణిపూర్‌లోని రెండు ప్రధాన మార్గాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన 'నేషనల్ హైవే 2' పై వెళ్లే ఈ బస్సు సర్వీసు.. రాష్ట్ర ప్రజలకు బయటి ప్రపంచంతో అనుసంధానం కల్పించే ప్రధాన రవాణా మార్గంగా ఉండేది.

అయితే, 2023 మే 3న కుకీ, మైతేయిల మధ్య చెలరేగిన జాతి ఘర్షణల కారణంగా ఈ రవాణా సేవ తీవ్రంగా దెబ్బతింది.



శుక్రవారం ఉదయం ఇంఫాల్ నుండి అస్సాం రాజధాని గువహటికి రెండు బస్సులు, ఐదు వింగర్ వాహనాల్లో 125 మంది ప్రయాణికులు బయలుదేరారని మణిపూర్ ప్రభుత్వ అధికారులు తెలిపారు. గువహటికి వెళ్తున్న ఈ బస్సులు మధ్యాహ్న సమయంలో నాగాలాండ్‌లోకి ప్రవేశించే ముందు, కుకీల ప్రాబల్యం ఉన్న కాంగ్‌పోక్సీ జిల్లా, నాగాలు అధికంగా ఉండే సేనాపతి జిల్లా మీదుగా ప్రయాణించనున్నాయని అన్నారు.

## కెన్యాలో హెలికాప్టర్ ప్రమాదం

- ఇంటెలిజెన్స్ చీఫ్, ఆయన భార్య సహా ఏడుగురు మృతి

**నైరూబీ, ఆగస్టు 21 :** కెన్యాలోని సంబురు కౌంటీలో బుధవారం జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ మిచెల్ సెన్సికాంటుగి, ఆయన భార్య స్టెఫానీ హోలిహాన్ తో సహా ఒక అమెరికన్ మీడియా ఎగ్జిక్యూటివ్, నలుగురు ఇతర అమెరికన్లతో సహా మొత్తం ఏడుగురు మరణించారు. లోయిసాబాలోని ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి ఇవాసో నైరో నదికి హెలికాప్టర్ విహారయాత్రకు వెళుతుండగా ఉదయం 9:13 గంటలకు ఈ ప్రమాదం సంభవించిందని కెన్యా పౌర విమానయాన అథారిటీ తెలిపింది. హెలికాప్టర్ ప్రమాదంలో మిచెల్ సెన్సికాంటుగి మరణించినట్లు ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడు గిల్లెర్మో లాసో పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తరపున అధ్యక్షుడి కార్యాలయం నివాళులర్పించింది.

## సీజేపీ 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ముమ్మరం



- మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాల తనిఖీ

**ముంబయి, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్) :** సీజేపీ 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా మహారాష్ట్ర లాతూర్ జిల్లాలోని ఔసా ప్రాంతంలో ఉన్న ఒక ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇతర పాఠశాల విద్యార్థులను ఆ స్కూల్‌లో కూర్చోబెట్టారని ఆయన ఆరోపించారు. ఆ విద్యార్థుల పేర్లు స్కూల్ రికార్డులలో కూడా నమోదు కాలేదని తెలిపారు. ఒక మంత్రి కుక్కకు కూడా విద్యార్థుల కంటే మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి. పదేళ్లుగా కారుతున్న పైకప్పులను బాగు చేయలేకపోయినా లేదా బెంచీల కొరతను తీర్చలేకపోయినా, ప్రభుత్వం అసలు ఏం సాధించినట్లు?' అని ప్రశ్నించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని దిప్కే డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలోని పాఠశాలల దుస్థితికి బాధ్యులైన, అధికారిక పర్యటనల పేరుతో అందుబాటులో లేని బ్లాక్ విద్యాశాఖ అధికారులను ఎనిమిది రోజుల్లోగా సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### చక్కెరపై బీహార్ మంత్రి బాధ్యతరాహిత్య వ్యాఖ్యలు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ కామెంట్లు

**పాట్నా, ఆగస్టు 21 (ఏ.ఎం.ఎస్) :** డయాబెటిస్ కేసులు పెరుగుతుండటంతో చక్కెర ధరల పెంపు ప్రజలపై పెద్దగా ప్రభావం చూపదని బీహార్ మంత్రి శ్రవణ్ కుమార్ బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఇప్పటికే చక్కెరను తక్కువగా తీసుకుంటున్నారు. అందరూ మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ రోజుల్లో స్వీట్లు ఎవరు తింటున్నారు? చక్కెర ధర పెరుగడం వల్ల పెద్దగా తేడా ఏమీ ఉండదని నా భావన. దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని మీడియాతో అన్నారు.

కాగా, మంత్రి శ్రవణ్ కుమార్ వ్యాఖ్యలను స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఆయన నుంచి ప్రజలు ఏమి ఆశించగలరని వ్యాఖ్యానించారు. 'ఆవు పేడపై ఎంత నెయ్యి పోసినా, అది ఆవు పేడ రుచినే కలిగి ఉంటుంది.